నవతెలంగాణ

1

మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట

మంగళవారం 13 జూన్ 2023

షెడ్యూల్ పరిశ్రమల కనీస వేతన జీవోను సవరించాలి



సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు

నవ తెలంగాణ సిద్దిపేట అర్బన్

రాష్ట్రంలో షెడ్యూల్ పరిశ్రమల్లో పెండింగ్‌లో ఉన్న కనీస వేతనాల జీవోను సవరించి ఐదు జీవోల విజిట్ విడుదల చేయాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు అన్నారు. సోమవారం సిద్దిపేటలో ఏర్పాటు చేసిన సీఐటీయూ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. గత 15 సంవత్సరాలుగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోగాని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక కూడా 73 రకాల షెడ్యూల్ పరిశ్రమల జీవులను ప్రభుత్వం సవరించడం లేదన్నారు. నిత్యావసర సరుకులు, ఇంటి అద్దెలు, విద్యా, వైద్యం ఖర్చులు అనేక రెట్లు పెరిగాయన్నారు. వేతనాలు పెరగడం లేదన్నారు. ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనేషన్ సిఫారసు మేరకు కనీస వేతనం రూ.26 వేలు ఉండేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. రాష్ట్రంలో కార్మికుల జీవన అవసరాలు తీరాలంటే వెంటనే జీతాలు పెరగాలని అన్నారు. గ్రామపంచాయతీ, అంగన్వాడీ, ఐకేపీ వీవోఏల సమస్యలు పరిష్కరించాలని కోరారు. అనంతరం అంగన్వాడీ టీచర్ల సమస్యల పరిష్కారం కోసం జూలై 16న ఆదిలాబాద్‌లో ప్రారంభించనున్న జీపుజాత కార్యక్రమ గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐటీయూ అంగన్వాడీ టీచర్స్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పద్మ మాట్లాడారు. ఎన్నో ఎన్నిసార్లు పోరాటం చేస్తే రాష్ట్ర ప్రభుత్వం మాట ఇచ్చి తప్పిందని గుర్తు చేశారు. అంగన్వాడీ టీచర్లకు నెలకు రూ.26 వేల కనీస వేతనం అందించాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ ఉద్యోగులకు గ్రాట్యూటీ చెల్లించాలని తెలిపారు. జీపు జాత జూలై 20న సిద్దిపేటకు చేరుకుంటుందన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు ఆయాలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సీఐటీయూ నాయకులు గోపాలస్వామి, శశిధర్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల.. స్వాగతం





- తొలి రోజు హాజరు అంతంతే
- పాత పుస్తకాలు...యూనిఫామ్స్
- మధ్యాహ్నం బువ్వ పెట్టని వైనం
- కొత్త మెనూ అమలు ఎప్పుడో..?
- పూర్తవ్వని తొలి దశ మన ఊరు-మన బడి పనులు
- కొనసాగుతున్న మన ఊరు-మన బడి
- రెండో దశ స్కూళ్ల ఎంపికకు కసరత్తు
- కనిపించని స్వచ్ఛత..

స్కూల్స్ షురూ అయ్యాయి. తొలి రోజు పిల్లల హాజరు అంతంతే ఉంది. మన ఊరు-మన బడి పనులు పూర్తవలే. పాఠశాల పరిసరాలు, తరగతి గదులు, మరుగుదొడ్ల పరిశుభ్రత పట్టదు. మధ్యాహ్నం బువ్వ లేదు. తాగేనీరు రాదు. పుస్తకాలందలేదు. యూనిఫామ్స్ ఇవ్వలే. పంతుళ్ల కొరత. ఫ్యాన్లులేక ఉక్కపోత... వెరసీ విద్యార్థులకు సమస్యలు స్వాగతం పలికాయి. ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా పాఠశాలలు పున:ప్రారంభమయ్యాయి. పావొంతు పిల్లలు కూడా బడికిరాలే.

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

ప్రభుత్వ స్కూళ్లల్లో 12 రకాల మౌలిక సదుపాయాలు కల్పించాలనే ఉద్దేశంతో మన ఊరు-మన బడి, మన బస్తీ-మన బడి అనే కార్యక్రమాన్ని చేపట్టింది. గతేడాది విద్యా సంవత్సరం ప్రారంభంతో తొలి దశలో కొన్ని స్కూళ్లను ఎంపిక చేసింది. తరగతి గదులు, ప్రహరీ, మరుగుదొడ్ల నిర్మాణం, రంగులేయడం, బెంచీలు, కుర్చీలు, టేబుల్స్, బ్లాక్ బోర్డ్స్, లైబ్రరీ, బోర్డు, బొమ్మలు, గ్రౌండ్ వంటి పనుల్ని చేయాలని నిధులు మంజూరు చేశారు. రూ.30 లక్షలలోపు ఎస్ఎంఎస్ కమిటీలు, ఆపైన వ్యయమైతే కాంట్రాక్టు పద్ధతిలో పనుల్ని అప్పజెప్పారు. 1260 ప్రభుత్వ స్కూల్స్ ఉండగా తొలి విడతలో 343 స్కూల్స్‌ను ఎంపిక చేశారు. ఆయా పాఠశాలల్లో అవసరాలను బట్టి పనుల్ని మంజూరు చేశారు. వీటిల్లో సగం స్కూల్స్‌లో కూడా వందశాతం పనులు పూర్తవ్వలేదు. మిగతా స్కూల్స్‌లో వివిధ దశల్లో పనులు ప్రగతిలో ఉన్నాయి. సంగారెడ్డి జిల్లాలో 441 స్కూల్స్‌లో పనులు మంజూరు చేశారు. 200 స్కూల్స్ వరకే పనులు జరిగాయి. మెదక్ జిల్లాలో



313 స్కూల్‌ను ఎంపిక చేయగా 156 స్కూల్స్‌లోనే పనులు జరిగాయి. మూడు జిల్లాల్లోనూ 50 శాతానికి మించి వందశాతం పనులు పూర్తవలేదు. చాలా చోట్ల కాంట్రాక్టర్ల నిర్లక్షంతో పెండింగ్‌లో ఉన్నాయి.

కొత్త మెనూ ఎప్పుడో..?

సోమవారం కిచిడీ, మిక్స్‌డ్ వెజిటెబుల్స్, గుడ్డు, మంగళవారం అన్నం సాంబారు. మిక్స్‌డ్ వెజిటెబుల్ కర్రీ బుధవారం అన్నం, ఆకుకూరల పప్పు, మిక్స్‌డ్ వెజిటెబుల్ కర్రీ, గురువరాం వెజిటెబుల్ బిర్యానీ, మిక్స్‌డ్ వెజిటెబుల్ కర్రీ, శుక్రవాం అన్నం, సాంబారు, మిక్స్‌డ్ వెజ్‌టెబుల్ కర్రీ, శనివారం అన్నం, ఆకుకూరల పప్పు, మిక్స్‌డ్ వెజ్‌టెబుల్ కర్రీ పెట్టాలని కొత్త మెనూ ఖరారు చేశారు. పౌష్టికమైన ఆహారం అందించాలనే లక్ష్యం మంచిదే అయినప్పటికీ అందుకు సరిపడా బడ్జెట్ కేటాయించాలి. ఏ ఒక్క స్కూల్‌కు కూడా కొత్త మెనూ పెట్టేందుకు ఏర్పాట్లు జరగలేదు. పైగా తొలి రోజు బడికొచ్చిన పిల్లలకు మధ్యాహ్నం బువ్వ పెట్టలేదు. సంగారెడ్డిల్లో కొద్దిపాటి అన్నం, పప్పుతో భోజనం పెట్టారు.

పుస్తకాలందేదెప్పుడో?

పాఠశాలలు పున:ప్రారంభం అవ్వకముందే పాఠ్యపుస్తకాలను పాఠశాలకు చేరవేస్తామని చెప్పారు. ఇప్పటికే కొన్ని పుస్తకాలు మండల కేంద్రాలకు చేరాయి. వాటిని ఆయా పాఠశాలకు చేరవేయలేదు. పుస్తకాల ముద్రణలో ఆలస్యమవ్వడమే కాకుండా ప్రింటైన వాటిని సకాలంలో రవాణా చేయకపోవడంతో విద్యార్థులకు పుస్తకాలందడం ప్రతి ఏటా ఆలస్యమవుతోంది. సీనియర్ల పాత పుస్తకాలను సేకరించి జూనియర్లకిస్తున్నారు. అవి అందని విద్యార్థులు రెండు మూడు వారాలైనా పాఠ్యపుస్తకాల్లేకుండానే చదవులు కొనసాగించాలి. సంగారెడ్డి జిల్లాలో 10.38 లక్షల పుస్తకాలు కావాల్సి ఉండగా సగం మాత్రమే వచ్చాయి. మెదక్ జిల్లాలో 4.60 లక్షల పుస్తకాలు కావాల్సి ఉండగా 3.75 లక్షలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. సిద్దిపేట 5.19 లక్షల పుస్తకాలను గాను ఇప్పటికే 5 లక్షల వరకు అందాయి. మిగతా పుస్తకాల్ని వారం రోజుల్లో విద్యార్థులకు అందజేస్తే తప్ప చదువులు సాఫీగా సాగే పరిస్థితి ఉంది.

పంతుళ్ల కొరత

పాఠశాలలు తెరిచినా పాఠాలు చెప్పేందుకు పంతుళ్లు సరిగా లేరు. చాలా మంది బదిలల కోసం ఎదురు చూస్తున్నారు. కొన్ని స్కూళ్లల్లో పంతుళ్ల కొరత ఉంది. సిద్దిపేట జిల్లాలో 649 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో 750 పోస్టుల వరకు ఖాళీగా ఉన్నాయి. ఉపాధ్యాయ పోస్టుల్ని భర్తీ చేయకపోగా కనీసం విద్యా వలంటీర్ల నియామకానికైనా నోటిఫికేషన్ ఇవ్వలేదు.

మంచినీళ్లు రావు

పాఠశాలల పున:ప్రారంభానికి ముందు పాఠశాలల పరిసరాలు, గ్రౌండ్, తరగతి గదులు, మరుగుదొడ్లను శుభ్రం చేయాలి. వేసవి సెలవుల వల్ల దుమ్ము, బూజు పట్టిపోయాయి. చెత్తాచెదారం పేరుకుపోయింది. మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉన్నాయి. వీటిని క్లీన్ చేయాల్సి ఉన్నా మొక్కుబడిగా చేశారు. ఆఫీసు గదులు, కార్యాలయ పరిసరాల్ని మాత్రమే పరిశుభ్రం చేసుకున్నారు. మంచినీళ్లు రాలేదు. వాటర్ ట్యాంకర్లను బీచింగ్ పౌడర్ వేసి క్లీన్ చేయలేదు. మిషన్ భగీరథ నీళ్లు కావట్లేదు. దీంతో విద్యార్థులు ఇంటి నుంచి వాటర్ బాటిళ్లు తెచ్చుకుంటున్నారు. సంగారెడ్డి పట్టణంలోని బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలతో పాటు ఇతర స్కూల్స్ పరిశీలించగా అరకొరగా శుభ్రం చేశారు.

అన్ని స్కూల్స్ ఆధునీకరణ



ప్రభుత్వ స్కూళ్లన్నీ ఆధునీకరించబడుతున్నాయి. తొలి దశలో పనులు పూర్తికావస్తున్నాయి. రెండో దశలోనూ స్కూళ్ల ఎంపిక చేసి అన్ని పనులు పూర్తయ్యేలా చూస్తున్నాం. పుస్తకాలు వచ్చాయి. విద్యార్థుల హాజరు పెరగగానే పంపిణీ చేస్తాం. కొత్త మెనూ ప్రకారమే మధ్యాహ్న భోజనం పెడతారు. పరిశుభ్రత విషయంలో రాజీలేదు. అన్ని స్కూల్స్‌లో స్వచ్ఛత పాటిస్తున్నారు.

– వెంకటేశ్వర్లు, డీఈఓ

ఆరోగ్య తెలంగాణ దిశగా రాష్ట్రం

- ఎంపీ బీబీ పాటిల్
- ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం
- జెడ్పీ చైర్ పర్సన్ మంజుశ్రీ జైపాల్‌రెడ్డి





నవతెలంగాణ-సంగారెడ్డి

తెలంగాణ అన్ని రంగాలలో అభివృద్ధి సాధిస్తూ, ఆరోగ్య తెలంగాణ దిశగా రాష్ట్రం పయనిస్తుందని ఎంపీ బీబీ పాటిల్ అన్నారు. రాష్ట్రావతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా సోమవారం తెలంగాణ రన్ కార్యక్రమాన్ని పోలీస్ శాఖ ఆధ్వర్యంలో యువజన, క్రీడల శాఖ భాగస్వామ్యంతో నిర్వహించారు. సంగారెడ్డి ఎస్పీ కార్యాలయం నుండి కొత్త బస్టాండ్ వరకు నిర్వహించిన ర్యాలీని ఎంపీ బీబీ పాటిల్ జెడ్పీ చైర్ పర్సన్ మంజుశ్రీ జైపాల్ రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. సంగారెడ్డి పట్టణంలోని కల్వకుంట రోడ్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని బెలూన్లను గాల్లోకి ఎగురవేశారు. ఈ సందర్భంగా ఎంపీ బీబీ పాటిల్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం దేశానికే రోల్ మోడల్‌గా నిలిచిందన్నారు. అన్ని రంగాలలో పురోగమిస్తూ, ఆరోగ్య తెలంగాణ దిశగా పయనిస్తుందన్నారు. తెలంగాణ వచ్చిన తర్వాత ప్రజల కష్టాలు తీరాయన్నారు. జడ్పీ చైర్ పర్సన్ మంజుశ్రీ జైపాల్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ప్రజల సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా పని చేస్తుందన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నేడు నిర్వహించిన రన్‌లో అన్ని వర్గాల ప్రజలు పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ మాట్లాడుతూ తెలంగాణ అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందన్నారు. కొత్త జిల్లాల ఏర్పాటుతో పరిపాలన ప్రజలకు చేరువైందని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చారన్నారు. ప్రజలతో మమేకమై పనిచేసేలా ఫ్రెండ్లీ పోలీస్‌గా మార్చారని గుర్తు చేశారు. మిషన్ కాకతీయ, చెక్ డ్యామ్‌ల నిర్మాణంతో జిల్లాలో భూగర్భ జలాలు పెరిగాయని, సాగు విస్తీర్ణం మూడంతులు పెరిగిందన్నారు. జిల్లా ఎస్పీ రమణ కుమార్ మాట్లాడుతూ ఒకప్పుడు ఏదైనా సమస్య ఉందంటే సినిమాలోలాగా అంతా అయిపోయిన తర్వాత పోలీసులు వచ్చే వారిని, తెలంగాణ పోలీస్‌లు అలాకాదని, ఫోన్ కాల్‌తో ప్రజలకు అందుబాటులో ఉంటున్నారని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ చింతా ప్రభాకర్, ప్రజా ప్రతినిధులు, అదనపు కలెక్టర్ వీరారెడ్డి, ఉమ్మడి మెదక్ జిల్లా డిసిసిబి ఉపాధ్యక్షులు పట్నం మాణిక్యం, మున్సిపల్ చైర్ పర్సన్ విజయలక్ష్మి, డిఆర్ఓ నగేష్, ఆర్డీవో రవీందర్ రెడ్డి, డీఎస్పీ రవీందర్ రెడ్డి, తాసిల్దార్ విజయకుమార్, గెజిటెడ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు వైద్యనాథ్, కాసాల బుచ్చిరెడ్డి, నరహరి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌వీపోలిమర్స్ పరిశ్రమలో..

రియాక్టర్ పేలిన ఘటనలో ముగ్గురు మృతి





- ప్రమాదాలను అరికట్టలేని పరిశ్రమల శాఖ ఎందుకు?
- ఆర్‌వీ ఇంజనీరింగ్ పరిశ్రమ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలి
- చనిపోయిన కుటుంబాలకు రూ.50 లక్షల నష్టపరిహారం చెల్లించాలి
- సీఐటీయూ జిల్లా కోశాధికారి నర్సింహారెడ్డి

నవతెలంగాణ – పటాన్ చెరు

పాశమైలారం పారిశ్రామిక వాడలోని ఆర్‌వీ పోలిమర్స్ పరిశ్రమలో రియాక్టర్ పేలిన ఘటనలో చికిత్స పొందుతూ ముగ్గురు మృతి చెందారు. శనివారం సాయంత్రం పరిశ్రమలో ఆకస్మాత్తుగా రియాక్టర్ పేలడంతో ఒక్కసారిగా మంటలు వ్యాపించి అక్కడే ఉన్న రమణారెడ్డి (49), వెంకటేశ్వరరావు(49), సతీష్ (45)కు తీవ్ర గాయాలు కాగా బీడీఎల్ పోలీసులు తీవ్రంగా కాలిన ముగ్గురిని అంబులెన్స్‌లో పటాన్‌చెరు పట్టణంలోని ధ్రువ ఆసుపత్రికి తరలించారు. తీవ్రంగా కాలిన గాయాలతో చికిత్స పొందుతున్న ముగ్గురిలో రమణారెడ్డి(49) ఆదివారం మధ్యాహ్నం మృతి చెందారు. సతీష్, వెంకటేశ్వరరావు ఆదివారం రాత్రి మృతి చెందడంతో వారి కుటుంబాలలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

ప్రమాదాలను అరికట్టలేని పరిశ్రమల శాఖ ఎందుకు?

పాశమైలారం పారిశ్రామిక వాడలోని ఆర్‌వీ ఇంజనీరింగ్ పరిశ్రమలో జరిగిన ప్రమాదాన్ని సోమవారం సీఐటీయూ పరిశీలించింది. అనంతరం పరిశ్రమ గేటు ముందు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కోశాధికారి నరసింహారెడ్డి మాట్లాడుతూ పారిశ్రామిక ప్రాంతంలో రోజూ అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని కార్మిక శాఖ, పరిశ్రమల శాఖ, ఫ్యాక్టరీస్ ఆఫ్ ఇన్స్పెక్టర్స్ ఇవేవీ పట్టించుకోకుండా చనిపోయే వాళ్లు కార్మికులు కాదా? మాకెందుకని ఒక నిర్లక్ష్య ధోరణితో యాజమాన్యాలు, అధికారులు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఎలాంటి సేఫ్టీ ప్రికాషన్స్ తీసుకోకుండా మిషనరీ మధ్య ఎలాంటి క్యాప్స్ లేకుండా ప్రమాదం జరిగితే తప్పించుకోవడానికి కూడా అవకాశం లేకుండా యాజమాన్యాలు పరిశ్రమలను ఏర్పాటు చేస్తున్నాయని ఆరోపించారు. అనుమతులు ఇస్తున్న పరిశ్రమల శాఖ ఏమాత్రం పరిశీలించకుండా ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నా పట్టించుకోకుండా.. వారికి కావాల్సినవి తీసుకుని ఇష్టం ఉన్నట్టు మిషనరీని పెట్టుకోండని ఇష్టం ఉన్నట్టు కార్మికులను వినియోగించుకోండనే పద్ధతిలో అనుమతులు ఇస్తుండడం అత్యంత దారుణమన్నారు. పరిశ్రమల యజమాన్యాలు ఆడిందే ఆట పాడిందే పాట అన్న ధోరణిలో ఉండడంతోనే ఇలాంటి ప్రమాదాలు జరిగి కార్మికులు పిట్టల్లాగా రాలిపోతున్నా... ఇటు యాజమాన్యాలు, అటు అధికారుల్లో ఎలాంటి చలనం లేకుండా పోయిందని వాపోయారు. ఒక ప్రమాదం తర్వాత కూడా ఇంకో ప్రమాదం జరగకుండా చూడాలనే ఇంగిత జ్ఞానం కూడా ఈ అధికారులకు లేదన్నారు. యాజమాన్యాలు లాభాలు వస్తే చాలు కార్మికులు ఏమైపోతే మాకేందనే పద్ధతిలో పరిశ్రమలు పెడుతూ... ఎలాంటి చట్టపరమైన పికాషన్స్ తీసుకోకుండానే కార్మికులను వినియోగిస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఈ ప్రమాదాల వల్ల కార్మిక కుటుంబాలకు జరుగుతున్న అన్యాయాన్ని గమనంలో పెట్టుకొని వారి ప్రాణాలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఆర్‌వీ ఇంజనీరింగ్ పరిశ్రమ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. చనిపోయిన కుటుంబాలకు రూ.50 లక్షల నష్టపరిహారం చెల్లించాలన్నారు. ఈ విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామన్నారు. సీఐటీయూ నాయకులు సుధాకర్, హరినాథ్, ప్రసాద్, రోషన్, పరమేష్, వివిధ పరిశ్రమల కార్మికులు పాల్గొన్నారు.

కనీస వేతనాలకు నోచుకోని కార్మికులు

- ఈ నెల 12 నుంచి జూలై 7 వరకు రాష్ట్ర వ్యాప్త ఆందోళనలు
- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జే.మల్లికార్జున్



నవతెలంగాణ – పటాన్ చెరు

గత 15 ఏళ్లుగా కార్మికులు కనీస వేతనాలకు నోచుకోవడం లేదని, వెంటనే కనీస వేతనాలు పెంచాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జే.మల్లికార్జున్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం పటాన్‌చెరు పట్టణంలోని శ్రామిక భవన్‌లో జరిగిన సీఐటీయూ కార్యకర్తల సమావేశంలో మల్లికార్జున్ మాట్లాడుతూ రాష్ట్రంలో వెంటనే కనీస వేతనాలను పెంచాలని డిమాండ్ చేశారు. 15 సంవత్సరాల నుంచి కనీస వేతనాలు పెరగడం లేదన్నారు. ఇది అత్యంత దుర్మార్గమన్నారు. రాష్ట్రంలో అన్ని జీఓల కాలపరిమితి ముగిసినప్పటికీ వాటిని సవరించకపోవడం దారుణమన్నారు. నేడు అన్ని రకాల నిత్యవసరాల ధరలు పెరుగుతున్నప్పుడు కార్మికుల వేతనాలు ఎందుకు పెరగడం లేదని ప్రశ్నించారు. కాల పరిమితి ముగిసిన అన్ని జీవోలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే సవరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 12 నుంచి జూలై 7వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా వివిధ రూపాల్లో ఆందోళన చేస్తున్నామని తెలిపారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం చేస్తున్న ఈ ఆందోళనలలో కార్మికులందరు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కే.రాజయ్య, నరసింహారెడ్డి, పాండురంగారెడ్డి, శ్రీధర్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఊరచెరువు కోసం ఏకమైన గ్రామస్తులు

పూడ్చిన మట్టిని తొలగించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్



నవతెలంగాణ-దుబ్బాక

తాతలకాలం నాటి నుండి గ్రామానికి జీవనాధారమైన ఊర చెరువు (బూర్గుకుంట)ను రక్షించుకోవడం కోసం బల్వంతాపూర్ గ్రామస్తులు ఏకమయ్యారు. తమ చెరువును రక్షించి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం దుబ్బాక పురపాలిక కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట బల్వంతాపూర్ గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. కొందరు వ్యక్తులు మట్టి నింపుతూ చెరువును అన్యాక్రాంతానికి పాల్పడుతున్నారని ఆరోపిస్తూ ఆర్ఐ నరసింహారెడ్డి, ఇరిగేషన్ ఏఈ రోహిత్ లకు వినతిపత్రం అందజేశారు. సమస్యను తక్షణమే పరిష్కరించాలని పట్టుబట్టారు. గ్రామస్తుల డిమాండ్ మేరకు చెరువు పూడ్చివేతకు పాల్పడుతున్న ముగ్గురు వ్యక్తులపై దుబ్బాక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయడం జరిగిందని ఇరిగేషన్ ఏఈ రోహిత్ చెప్పారు.

ఉచిత పాఠ్య పుస్తకాల పంపిణీ



నవతెలంగాణ-నంగునూరు

ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పాఠ్య పుస్తకాలను సోమవారం నంగునూరు మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు మండల విద్యాధికారి తగిరెడ్డి దేశిరెడ్డి పంపిణీ చేశారు. నంగునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వము విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, రెండు జతల దుస్తులు, పౌష్టికాహారంతో కూడిన మధ్యాహ్న భోజనం అందిస్తామని తెలిపారు. ఆరు నుండి పదో తరగతి విద్యార్థులకు ఈ సంవత్సరం ఉచితంగా నోటు పుస్తకాలు కూడా అందజేయడం జరుగుతుందన్నారు. ఉపాధ్యాయులు మరింత శ్రద్ధ చూపి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు చేరే విధంగా కృషి చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన బోధన, ఉత్తమ ఫలితాలను సాధించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నంగునూరు ఉన్నత పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు డి రవీంద్రారెడ్డి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు మనీష్ కుమార్ ఉపాధ్యాయులు శనిగరం కనకయ్య, సీఆర్పీలు పెంటయ్య, అశోక్ ,మోహన్ బాబు, రేణుక, ఎమ్మార్సీ సిబ్బంది ఉమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పట్టపగలే వ్యక్తి దారుణ హత్య






నవతెలంగాణ-జహీరాబాద్

పట్టణంలోని వతన్‌బాక్‌కు చెందిన మహమ్మద్ మక్సుద్ (45)ను సోమవారం పట్టణంలోని పశువుల సంత వద్ద గుర్తు తెలియని వ్యక్తులు కత్తులతో దాడి చేసి దారుణంగా హత్య చేశారు. జహీరాబాద్ ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. మక్సుద్ స్థానికంగా బంగారం దుకాణాన్ని నిర్వహిస్తున్నాడు. అయితే ఆయన దుకాణంలో పనిచేసే ఓ కూలీ పలువురి దగ్గర అప్పు చేశాడు. వారు ఈ అప్పు విషయమై పలుమార్లు అడగ్గా.. మక్సుద్ వారికి నచ్చజెప్పాడు. కాగా సోమవారం ఈ అప్పు విషయమై మాట్లాడదామని అప్పు ఇచ్చిన వారు మక్సుద్‌ను పిలిచారు. దీంతో తన అన్న కుమారుడు సుహాన్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై పశువుల సంత వద్దకు మక్సుద్ వెళ్లాడు. అక్కడే ఉన్న ముగ్గురు వ్యక్తులు ఒక్కసారిగా వారిపై దాడికి పాల్పడ్డారు. దీంతో మక్సుద్ అక్కడికక్కడే మృతి చెందగా.. సుహాన్‌ను కూడా కత్తులతో వెంబడించగా పక్కనే ఉన్న ఇంట్లోకి వెళ్లి దాక్కోవడంతో ప్రాణాలతో భయటపడ్డాడు. ఘటనా స్థలాన్ని జహీరాబాద్ డిఎస్పి వీ.రఘు, రూరల్ సిఐ వెంకటేష్ తదితరులు పరిశీలించారు. మతదేహాన్ని స్థానిక కమ్యూనిటీ వైద్యశాలలో ఉంచి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నారు. ద్విచక్ర వాహనంపై ముగ్గురు వ్యక్తులు కత్తులతో బహిరంగంగా తిరగడాన్ని చూసి స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. రోడ్లపై నుంచి ఇండ్లల్లోకి పరిగెత్తారు. దీంతో పట్టణంలో భయానక వాతావరణం నెలకొంది.

పట్టా భూమి.. ప్రభుత్వ భూమిగా

సీజీఆర్ ట్రస్ట్ చైర్మెన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి



నవతెలంగాణ-గుమ్మడిదల


జిల్లా, మండల రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యంతో పట్టా భూమి ధరణిలో ఏకంగా ప్రభుత్వ భూమిగా మారింది. దీంతో పట్టా కలిగిన బాధిత రైతులు అధికారుల తీరుపట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అనంతారం గ్రామ పరిధిలో గల సర్వేనంబర్ 173లో 59-00, 174లో 110-00 ఎకరాల రైతుల భూములను రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించి.. ధరణిలో ప్రభుత్వ భూమిగా నమోదు చేశారు. అయితే సుమారు 55 ఏండ్ల నుంచి పట్టాగా ఉన్నా ఈ భూములను అధికారులు ప్రభుత్వ భూమిగా చూపించడం పట్ల బాధిత రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా సీజీఆర్ ట్రస్ట్ చైర్మెన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి బాధిత రైతుల పట్టా భూమి పత్రాలను చూపిస్తూ సోమవారం మాట్లాడారు. అధికారుల తప్పిదం వల్ల పట్టాభూమి ప్రభుత్వ భూమిగా ధరణి వెబ్‌సైట్ వచ్చిందని.. అధికారుల తీరుపై మండిపడ్డారు. ఈ భూముల్లో ఎన్నో ఏండ్లుగా రైతులు వ్యవసాయం చేస్తున్నారని.. వారికి గత ప్రభుత్వాలు పట్టా పాసు బుక్కులు కూడా ఇచ్చాయని, అలాంటి భూమిని ప్రభుత్వ భూమిగా ఎలా మారుస్తారని ప్రశ్నించారు. రైతుల పక్షపాతి కేసీఆర్ సారథ్యంలో, ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి హయాంలో రైతుల పక్షాన ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టినప్పటికీ.. కొంతమంది రెవెన్యూ శాఖ అధికారుల వల్ల ప్రభుత్వం అబాసు పాలు అవుతున్నదన్నారు. కాగా బాధిత రైతులు ఎటువంటి ఆందోళన చెందొద్దని.. ఈ సమస్యను ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి దష్టికి తీసుకువెళ్లి పరిష్కార దిశగా త్వరలోనే చర్యలు చేపడతానన్నారు. దేశానికి అన్నం పెడుతున్న రైతన్నలు కన్నీరు పెడితే దేశానికి అరిష్టమని అందుకే కేసీఆర్ రైతుల సంక్షేమం కోసం రైతుబంధు, రైతు బీమా, మరెన్నో సంక్షేమ పథకాలు తీసుకువచ్చారని గుర్తు చేశారు. అలాంటి రైతులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా ఈ సమస్య పరిష్కార దిశగా సంబంధిత రెవెన్యూ శాఖ అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు ఆగయ్య, ఆగమయ్య, రమణ, గ్రామ రైతులు గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

చదువుతో పాటు ప్లేస్మెంట్ చూపిస్తున్న విద్యాసంస్థ



నవ తెలంగాణ – సిద్దిపేట

విద్యార్థులకు చదువుతోపాటు విద్య పూర్తయ్యే లోపు వివిధ సంస్థల ద్వారా ప్లేస్మెంట్ చూపిస్తూ విద్యార్థులకు అండగా నిలుస్తున్న విద్యాసంస్థ బీఎమ్ఆర్ డిగ్రీ, పీజీ కళాశాల. ఉస్మానియా యూనివర్సిటీ సెమిస్టర్ ఫలితాలలో 10 పాయింట్స్ సాధిస్తూ, అత్యుత్తమ విద్యార్థులను తయారు చేస్తున్న విద్యాసంస్థ. కళాశాల ప్రిన్సిపాల్ రాజా వెంకట్ రెడ్డి, డైరెక్టర్ దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ కళాశాలలో ప్రణాళిక బద్ధమైన బోధనతోనే మంచి ఫలితాలను సాధిస్తున్నామని అన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, విద్యార్థులకు అన్ని రకాల స్కాలర్‌షిప్స్ వస్తున్నాయన్నారు. కళాశాలలో బీఎస్సీలో ఎంపీసీ, ఎంపీసీఎస్, బీజెడ్‌సీ, ఎంఎస్‌డీఎస్, బీకాం కంప్యూటర్స్, బీకాం జనరల్, బీఏహెచ్‌ఈపీ, హెచ్‌టీపీ, ఎమ్మెస్సీలో ఆర్గానిక్ కెమిస్ట్రీ, ఫిజిక్స్, జువాలజీ, మ్యాథ్స్, ఎం కమ్ కోర్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. విద్యార్థులకు అన్ని రకాల ల్యాబ్ సౌకర్యాలు, కంప్యూటర్ సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.



శ్రీ శంకర్ ఫిల్లింగ్ స్టేషన్ ప్రారంభోత్సవంలో జడ్పీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యే

నవతెలంగాణ-జోగిపేట



డాకూర్ బైపాస్ రోడ్డు సమీపంలో మాజీ సర్పంచ్ శంకరయ్య నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ శంకర్ ఫిల్లింగ్ స్టేషన్‌ను సోమవారం సంగారెడ్డి జిల్లా జడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ జయపాల్‌రెడ్డి, అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్‌లు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ముందుగా పూజా కార్యక్రమాలు నిర్వహించి ఫీలింగ్ స్టేషను రిబ్బన్ కట్ చేసి ప్రారంభం చేశారు. బీఆర్ఎస్ నాయకుడు శంకరయ్య ఫీలింగ్ స్టేషన్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. వ్యాపారం బాగా జరగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మఠం బిక్షపతి, మాజీ మార్కెట్ చైర్మన్లు నాగ భూషణం, మల్లికార్జున్ గుప్తా, మండల పార్టీ అధ్యక్షులు లక్ష్మీకాంతరెడ్డి, తలేల్మా సర్పం చ్ లింగాగౌడ్, జోగిపేట కౌన్సిలర్లు కోరబోయిన నాగరాజు, దుర్గేష్, డాకూర్ మాజీ ఎంపిటిసి కళాలి రమేష్ గౌడ్, మాజీ జెడ్పిటిసి అర్జునయ్య తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీటీసీ గృహప్రవేశ వేడుకలో ఎంపీ, ఎమ్మెల్యే

నవతెలంగాణ-న్యాల్‌కల్



మండల జెడ్పీటీసీ స్వప్న భాస్కర్ వివాహ వార్షికోత్సవానికి, నూతన గృహప్రవేశ కార్యక్రమానికి జహీరాబాద్ ఎంపీ బిబి పాటిల్ , ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ దంపతులకు వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎంపీ, ఎమ్మెల్యే శాలువాతో సన్మానించారు. అటు పిమ్మట గృహప్రవేశ ఫంక్షన్‌లో వారు విందును స్వీకరించారు. బీఆర్ఎస్ నాయకులు షేక్ ఫరీద్, గోవర్ధన్ రెడ్డి, గుండప్ప, విజయ్ కుమార్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు రవీందర్, పాండురంగ రావు పాటిల్, మాజీ సర్ప ంచ్ శ్రీనివాస్ , మోహివుద్దిన్, నిరంజన్‌రెడ్డి. పీటర్‌రాజు, ఇజ్రాయేల్ బాబీ, మతంశెట్టి రాజ్ కుమార్ , ప్రవీణ్, మిర్జాపూర్ (బి) వినోద్, షకీల్, షఫీ, అక్షయ్ తదితరులు పాల్గొన్నారు.

మైక్రో బయాలజిస్ట్, ఫార్మాసిస్ట్ పోస్టులకు ఈనెల15న వాకిన్ ఇంటర్వ్యూలు

నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో మైక్రోబయాలజిస్ట్ (1), ఫార్మసిస్ట్ (1)పోస్టులను కాంట్రాక్ట్ పద్ధతిన నియామకాలకు ఈనెల 15న ఉదయం 10:00 గంటలకు వాక్ఇన్ ఇంటర్వ్యూ లు నిర్వహిస్తున్నట్టు జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మైక్రో బయాలజిస్ట్ పోస్టుకు ఉదయం 10:00 నుంచి 11:30 గంటల వరకు, ఫార్మసిస్ట్ పోస్టునకు మధ్యాహ్నం 12 గంటల నుంచి 2:00 గంటల వరకు వాక్ఇన్ ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. మైక్రో బయాలజిస్ట్ పోస్టులకు ఎండి మైక్రో బయాలజీ విద్యార్హతలు గలవారు అర్హులన్నారు. ఎంపికైన వారికి నెలకు ఒక లక్ష రూపాయల వేతనం లభిస్తుం దన్నారు. ఫార్మాసిస్ట్ పోస్టునకు బి ఫార్మసీ/డి ఫార్మసీ విద్యార్హతలు ఉండాలన్నారు. నెలకు రూ.17,500 వేతనం ఉంటుందన్నారు. ఆసక్తి అర్హత కలిగిన అభ్యర్థులు విద్యార్హతల ఒరిజినల్స్, జిరాక్స్ ప్రతులు రెండుసెట్లు తీసుకుని నిర్ణీత సమయంలోగా సంగారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరిండెంట్ ఛాంబర్‌లో నిర్వహించు ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు.



వినాయక ఆలయాన్ని దర్శించుకున్న ఎంపీ

నవతెలంగాణ-న్యాల్‌కల్

మండలంలోని రేజింతల్ సిద్ధి వినాయక ఆలయాన్ని జహీరాబాద్ ఎంపీ బిబి పాటిల్ సోమవారం దర్శించుకున్నారు. కాగా ఆయనకు ఆలయ ముఖద్వారం నుంచి అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామివారికి హారతితో ఎంపీ ప్రత్యేక పూజలు చేశారు. వారి వెంట నాయకులు ఎంపీటీసీ దేశెట్టి పాటిల్, రైల్వే బోర్డు మెంబర్ షేక్ ఫరీద్, అడ్వకేట్ పాండురంగారెడ్డి, గోవర్ధన్ రెడ్డి , అక్షయ్ దేశ్పాండే ఉన్నారు.



మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాల్లో ఎమ్మెల్యే

నవతెలంగాణ-గుమ్మడిదల

మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో సోమవారం నిర్వహించిన ఆలేటి నవీన శ్రీనివాస్‌రెడ్డి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన భ్రమరాంబ మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాల్లో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, జడ్పీ వైస్ చైర్మన్ కే ప్రభాకర్, మండల ప్రజా ప్రతినిధులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ప్రభాకర్ రెడ్డి, సర్పంచ్ బానోవత్ ఆంజనేయులు, దోమడుగు శంకర్, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సద్ది విజయభాస్కర్ రెడ్డి, చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, చిమ్ముల దేవేందర్ రెడ్డి, మమ్మద్ హుస్సేన్, మడపతి గణేష్, వివిధ గ్రామాల ముఖ్య నాయకులు కార్యకర్తలు భక్తులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు



ఘనంగా యువ నాయకుడు అజీజ్ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-హత్నూర

యువ నాయకుడు, బీఆర్ఎస్ జిల్లా నాయకులు ఎండి అజీజ్ జన్మదిన వేడుకలను అభిమానుల మధ్య సోమవారం ఘనంగా నిర్వహించారు. సోమవారం ఎమ్మెల్యే మదన్‌రెడ్డి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మదన్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం యువతకు ప్రాధాన్యతనిస్తుందన్నారు. అజీజ్ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు తీసుకెళ్లడంలో ముందుండాలన్నారు. ఈ కార్యక్రమంలో లేబర్ వెల్ఫేర్ బోర్డ్ చైర్మన్ దేవేందర్ రెడ్డి, జడ్పిటిసి అంజనేయులు, మండల పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, ఎంపీటీసీ విఠల్ రెడ్డి, నరసింహారెడ్డి, సలీం తదితరులు పాల్గొన్నారు.



బూచినెల్లిలో ముదిరాజ్ సంఘం జెండా ఆవిష్కరణ

నవతెలంగాణ-జహీరాబాద్

మండలంలోని బూచినెల్లి గ్రామంలో సోమవారం ముదిరాజ్ సంఘం జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించినట్టు ఆ సంఘం అధ్యక్షులు నారాయణ ముదిరాజ్ తెలిపారు. ముందుగా మహారా మాయణ కావ్య ప్రదాత మహర్షి వాల్మీకి ఆలయ ప్రారంభోత్సవం, ముదిరాజ్ సంఘం జెండా ఆవిష్కరించి.. నారాయణ ముదిరాజ్ మాట్లాడారు. బీసీలు ఐక్యంగా ఉన్నప్పుడు తమ హక్కులను సాధించవచ్చున్నారు. సంగప్పా ముదిరాజ్, గోపాల్ ముదిరాజ్, బరూర్, దత్తాత్రి ముదిరాజ్, రవి ముదిరాజ్‌లు మాట్లా డుతూ.. ఉమ్మడి మెదక్ జిల్లాలోనే మొట్టమొదటి మహర్షి వాల్మీకి మహారాజ్ ఆలయం ఇదేనన్నారు. అతిథులను బూచినెల్లి సంఘం అధ్యక్షులు, కార్యవర్గం సత్కరించినారు. ఈ కార్యక్రమంలో మహేశ్, అశోక్, గుండన్న, దినేష్, మహేష్, లక్ష్మన్న, పండరి, సుభాష్, కిస్టన్న, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.



జోగిపేటలో తెలంగాణ 2కే రన్

నవతెలంగాణ-జోగిపేట

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం జోగిపేట పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా నుంచి అందోల్ చౌరస్తా వరకు తెలంగాణ 2కే రన్ కార్య క్రమాన్ని పోలీస్ శాఖ జోగిపేట సీఐ నాగరాజు, ఎస్సై సామ్య నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, దళిత సంఘాల నాయకులు, యువజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పారిశ్రామికవాడలో ఘనంగా తెలంగాణ రన్

- పాల్గొన్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి, డిఎస్పి భీమ్ రెడ్డి

నవతెలంగాణ-పటాన్‌చెరు



నాడు స్వరాష్ట్ర సాధనలో.. నేడు బంగారు తెలంగాణ రూప కల్పనలో యువత పాత్ర కీలకమని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా 11వ రోజు సోమవారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఇక్రిశాట్ నుండి పటాన్‌చెరు మైత్రి మైదానం వరకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తెలంగాణ రన్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి జెండా ప్రారంభించారు. అనంతరం స్వయంగా రన్‌లో పాల్గొని అందరిని ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా మైత్రి మైదానంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతు యువత తలుచుకుంటే సాధ్యం కానిది ఏదీ లేదన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో అన్ని రంగాల్లో తెలంగాణ యువత మెరుగైన ప్రతిభ కనబరుస్తోందని తెలిపారు.ప్రధానంగా క్రీడలు, విద్య వైద్యం, ఉపాధి రంగాల్లో రాష్ట్ర ప్రతిష్టను ఇనుమడింప చేస్తున్నారని ఆనందం వ్యక్తం చేశారు. ప్రస్తుత సమాజంలో డ్రగ్స్ సమస్య యువత పాలిట శాపంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోను డ్రగ్స్ కు బానిస కాకుండా క్రీడల వైపు దృష్టి మళ్లించాలని విజ్ఞప్తి చేశారు. క్రీడల ద్వారా మానసిక ఉల్లాసం, శారీరక దారుఢ్యత లభించడంతో పాటు ప్రభుత్వ ఉద్యోగాలలో మెరుగైన అవకాశాలు లభిస్తాయని తెలిపారు. పటాన్‌చెరు నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతి యువకుల కోసం 2017, 2022 సంవత్సరాల్లో సొంత నిధులతో ఉచిత పోలీస్ శిక్షణ అందించడం జరిగిందని, సుమారు 500 మంది నిరుద్యో గులు ఉద్యోగాలు సాధించారని గుర్తు వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్‌చైర్మెన్ ప్రభాకర్, అమీన్పూర్ జెడ్పిటిసి సుధాకర్‌రెడ్డి, కార్పోరేటర్లు మెట్టు కుమార్ యాదవ్, పుష్ప నగేష్, డిఆర్డిఏ పిడి శ్రీనివాసరావు, డీఎస్పీ భీమ్ రెడ్డి, నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, సిఐలు, ఎస్సైలు, యువకులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

లక్ష రూపాయల సాయానికి 20లోపు దరఖాస్తు చేసుకోవాలి

నవతెలంగాణ-సంగారెడ్డి

జిల్లాలో నివసిస్తున్న వెనుకబడిన వర్గాల్లోని కుల వృత్తి దారులు, చేతివృత్తిదారులు ఈనెల 20లోపు లక్ష రూపా యల ఆర్థిక సాయానికి దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వెను కబడిన తరగతుల అభివృద్ధి అధికారి జగదీష్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. http://tsobmms.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు అన్నారు. ఈ పథకానికి 1) నాయిబ్రహ్మణులు 2) రజకులు 3) నగర/ ఉప్పర 4) కుమ్మరి శాలివహన 5) అవుసలి 6) కంసాలి 7) కమ్మరి 8) కంచరి 9) వడ్ల/ వడ్ర/ వడ్రంగి / శిల్పి 10) క్రిష్ణ బలిజ పూసల 11) మెదర 12) వడ్డెర 13) ఆరే కటిక 14) మేర / దర్జి 15) యం.బి.సి కులాల అభ్యర్థులు అర్హులన్నారు. అభ్యర్థుల వయస్సు 18 నుంచి 55 ఏండ్లలోపు ఉండాలని, కుల ధృవీకరణ మరియు ఆదాయ ధృవీకరణ పత్రము కలిగి ఉండాలన్నారు. కుటుంబ వార్షిక ఆదాయం గ్రామీణులకు రూ.1,50,000, పట్టణ వాసులకు రూ.2,00,000లకు లోబడి ఉండాలన్నారు. ఏప్రిల్, 2021 తర్వాత తీసిన ఆధాయ ధృవపత్రముతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. కుల వృత్తిలో ఉన్న కుటుంబంలో ఒక్కరు మాత్రమే దరఖాస్తు చేసుకోవడానికి అర్హులన్నారు. గత 5 ఏండ్లలోపు ఏ ప్రభుత్వ శాఖా ద్వారా ఆర్థిక లబ్దిపొందినా, 2017-18లో రూ. 50,000 లబ్దిపొందిన వారు అనర్హులన్నారు. కళ్యాణ లక్ష్మి పథకము ద్వారా లబ్దిపొందిన వారు ఈ పథకానికి ధరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కుల, ఆధాయ ధృవీకరణ పత్రము, ఆధార్ కార్డ్, ఆహార భద్రత కార్డ్, పాస్ పోర్ట్ సైజు పోటో మరియు బ్యాంక్ పాస్ బుక్ వంటి పత్రాలతో ఆన్‌లైన్‌లో ఈనెల 20లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

డీసీఎంఎస్ ఆధ్వర్యంలో విత్తనాల పంపిణీ



నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ పట్టణంలోని స్థానిక డీసీఎంఎస్ రైతుసేవా కేంద్రంలో ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ ఆధ్వర్యంలో సోయా, జనుమ, జీలుగ విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మానిక్‌రావు, ఉమ్మడి మెదక్ జిల్లా డిసిఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్‌తో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము రైతులకు అవసరమైన విత్తనాలను, ఎరువులను సబ్సిడీ మీద అందజేస్తున్నదని.. రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతులకు కావాల్సిన సౌకర్యాన్ని కల్పించడంలో తమ ప్రభుత్వం సఫలీకృతం అవుతున్నదన్నారు. నాణ్యమైన విత్తనాలు ఎరువులు అందించడంలో తమ ప్రభుత్వానికి ఎవరు కూడా సాటి రాలేరన్నారు. డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్ కృషి కారణంగా గత మూడేండ్లుగా జహీరాబాద్ నియోజకవర్గంలోని రైతులకు 60 నుండి 30శాతం సబ్సిడీ వరకు విత్తనాలను సరఫరా చేస్తున్నామన్నారు. జనుము బస్తా రూ.3500 కు, జీలుగ బస్తా రూ.2407 రైతులకు అందుతున్నదన్నారు. డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్ మాట్లాడుతూ.. జిల్లాలో విత్తనాలు, ఎమ్మార్పీ కంటే సబ్సిడీపై ఇప్పించడం ఎంతో హర్షించదగ్గ విషయమన్నారు. తెలంగాణ రాష్ట్రం రాక ముందు 90శాతం ఎరువులను ఉత్పత్తిదారులు ప్రైవేటు సంస్థలకు విక్రయించేవారు ప్రస్తుతం 40 శాతం ప్రభుత్వానికి విక్రయించి 60 శాతం మాత్రమే ప్రైవేటు వారికి విక్రయిస్తున్నారన్నారు. జిల్లాలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో 80 కేంద్రాల్లో ఎరువులు విత్తనాలను పంపిణీ చేయడం చేస్తున్నామన్నారు. టాక్స్ హాకా సంస్థలతో రెండు వందల కేంద్రాల ద్వారా విత్తనాలను ఎరువులను పంపిణీ చేస్తున్నామన్నారు. జహీరాబాద్ నియోజకవర్గంలో ఈ సంవత్సరం 61 వేల హెక్టార్లలో పత్తిపంట, 48 వేల హెక్టార్లలో జొన్న, 20000 హెక్టార్లలో చెరుకు 6 వేల హెక్టార్లలో పెసర మినుములు పంటలు సాగు చేస్తున్నట్లు అంచనా వేశామన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు ఎడి బిక్షపతి, ఆత్మ చైర్మెన్ పెంట రెడ్డీ, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గుండప్ప, మాజీ ఎంపీపీ విజయ్ కుమార్, ఇప్పెపల్లి పిఎసిఎస్ చైర్మన్ దాసరి మచ్చందర్, మాజీ మున్సిపల్ చైర్మన్ లు మంకల్ సుభాష్, అల్లాడి నర్సింహులు, కేతకీ ఆలయ చైర్మన్ నీల వెంకటేశం, బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సయ్యద్ మోహివుద్దిన్ తదితరులు పాల్గొన్నారు.

పడగంటి మహిపాల్‌కు డాక్టరేట్

నవతెలంగాణ-జోగిపేట



జోగిపేట పట్టణంలోని శ్రీ సాయి వెంకటేశ్వర హాస్పిటల్ బిఈఎంఎస్ డాక్టర్ పడగంటి మహిపాల్ డాక్టరేట్ పురస్కారాన్ని అందుకున్నారు. ఈనెల 11న ఢిల్లీ కాన్స్టిట్యూషన్ క్లబ్ ఆఫ్ ఇండియాలో ఇంటర్నేషనల్ విబిక్ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నేషనల్ వ్యాప్తంగా 58 మందికి డాక్టరేట్ పురస్కారాలు ప్రదానం చేశారు. ఇందులో భాగంగా తెలంగాణ నుంచి 6 మందిని ఎంపిక చేశారు. ఇంటిగ్రేత్యు వైద్య విభాగంలో మహిపాల్‌కు డాక్టరేట్ పురస్కారం దక్కింది. విబిక్ యూనివర్సిటీ ఛాన్సలర్ డాక్టర్ ఫిలెక్స్ ఆప్స్ డి జాన్, చేతుల మీదగా ఈ పురస్కారం అందుకున్నారు. ఈ కార్యక్రమానికి దేశంలోని వివిధ ప్రాంతాల ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు డాక్టరేట్ పురస్కారం రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. పురస్కారం రావడం పట్ల తనపై మరింత బాధ్యత పెరిగిందని, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందించేందుకు తాను కృషి చేస్తానన్నారు.

రాష్ట్రంలో ప్రజా పోలిసింగ్ వ్యవస్థ

నవతెలంగాణ-జహీరాబాద్



రాష్ట్రంలో ప్రజా పోలీసింగ్ వ్యవస్థ ఉన్నందునే.. ఈరోజు పోలీసు యంత్రాంగం మొత్తం ప్రజల్లో మమేకమై వారి సమస్యలను పరిష్కరించేందుకు శాయశక్తుల్లా కృషి చేస్తున్నదని ఎమ్మెల్యే మాణిక్ రావు అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జహీరాబాద్ డివిజన్ పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని ఐబి గెస్ట్ హౌస్ నుంచి ఎంఆర్‌హెచ్ఎస్ స్కూల్ గ్రౌండ్ వరకు సోమవారం తెలంగాణ 2కే రన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే మాణిక్‌రావు ముఖ్య అతిథిగా హాజరై త్రివర్ణ రంగుల బెలూన్ లు వదిలి రన్‌ని ప్రారంభించి.. 2కే రన్‌లో పాల్గొన్నారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాడు పోలీస్ స్టేషన్‌కు వెళ్లాలంటే సామాన్య ప్రజలు భయపడేవారన్నారు. ఈరోజు అలాంటి పరిస్థితులు లేవని.. ఎవరైనా ఫిర్యాదు చేసేందుకు స్టేషన్‌కు వెళ్తే కూర్చోబెట్టి ఫిర్యాదులు తీసుకొని వారి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిఆర్డిఓ జయదేవ్, డీఎస్పీ రఘు, ఆత్మ కమిటీ చైర్మెన్ పెంటారెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గుండప్ప, మాజీ ఎంపీపీ విజయ్ కుమార్, మాజీ మున్సిపల్ చైర్మెన్ అల్లాడి నర్సింహులు, కేతకీ ఆలయ చైర్మెన్ నీల వెంకటేశం, బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సయ్యద్ మోహివుద్దిన్, ఎంపీటీసీ సంపత్, తహశీల్దార్ స్వామీ, మున్సిపల్ కమిషనర్, పోలీస్ శాఖ అధికారులు సిఐలు భూపతి, నోముల వెంకటేశం, ఎస్ఐలు శ్రీకాంత్, పరమేష్, కాశీనాథ్, వినయ్, ఏడుకొండల్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పరమత సహనానికి మారుపేరు ఎమ్మెల్యే జిఎంఆర్



నవతెలంగాణ-రామచంద్రాపురం

కుల మతాలకు అతీతంగా అన్ని మతాల ప్రార్థన దేవాలయాల నిర్మాణాలకు, జీర్ణోద్ధారనలకు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి విరాళాల పరంపర కొనసాగుతూనే ఉంది. రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని శ్రీనివాస నగర్ కాలనీలో మెథడిస్ట్ చర్చి పునర్నిర్మాణ పనులకు సోమవారం సాయంత్రం స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సంద ర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లా డుతూ.. చర్చి స్లాబ్ నిర్మాణ పనులకు జీవీఆర్ ఎంటర్ప్రైజెస్ సంస్థ సౌజన్యంతో రూ.70 లక్షల రూపాయల నిధులు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. అన్ని మతాల సారాంశం ఒక్కటేనని, ప్రతీ ఒక్కరిలో పరమత సహనం పెంపొందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. నియోజకవర్గం వ్యాప్తంగా ఇప్పటికే 170కి పైగా దేవాలయాలు నిర్మించడంతోపాటు చర్చిలు, మసీదులు, ఆశిర్ఖానాలు, దర్గాలు నిర్మిస్తున్నామని తెలిపారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. భక్తులు సంఖ్యకు అనుగుణంగా చర్చి నిర్మాణం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించి నిధులు కేటాయించడం పట్ల చర్చి ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రభాకర్, స్థానిక కార్పొరేటర్ పుష్ప నగేష్, బీఆర్ఎస్ సర్కిల్ అధ్యక్షులు పరమేష్ యాదవ్, మెథడిస్ట్ చర్చి ప్రతిని ధులు సామ్యూల్ వినయ్ కుమార్, శామ్యూల్, సుందర్, ప్రశాంత్, సీనియర్ నాయకులు కార్యకర్తలు, చర్చి సభ్యులు పాల్గొన్నారు.

దుర్గమ్మ విగ్రహ పున:ప్రతిష్టాపనోత్సవంలో చింత సాయినాథ్

నవతెలంగాణ-సదాశివపేట



మండలంలోని వెల్టూరు గ్రామంలో సోమవారం దుర్గమ్మ నూతన మందిర విగ్రహ పున:ప్రతిష్ఠ, బొడ్రాయి పున ప్రతిష్టాపనో త్సవాలు చేపట్టారు. ఈ ఉత్సవాల్లో బీఆర్ఎస్ రాష్ట్ర యువ నాయ కులు చింతా సాయినాథ్ పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వెల్టూరు గ్రామ ప్రజలు ఐకమత్యంగా ఉండి ఆధ్యాత్మిక కార్యక్రములు నిర్వహిస్తూ.. తనను ఆహ్వానించినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అలాగే వెలూరు గ్రామానికి తన నాన్నకి ఎంతో అవినాభావ సంబంధం ఉన్నదని గుర్తు చేశారు. ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్న గ్రామ ప్రజలను, సర్పంచ్‌ని అభినందించారు. అనంతరం గ్రామ ప్రజలు, ఆలయ కమిటీ తరపున సర్పంచ్ లక్ష్మారెడ్డి సాయినాథ్‌ని శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి లక్ష్మారెడ్డి, ఎంపీపీ యాదమ్మ సొసైటీ చైర్మన్ రత్నాకర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు పెద్ద గొల్ల ఆంజనేయులు, ముబారక్పూర్ సర్పంచ్, మాజీ సర్పంచ్ గడ్డమీది సత్యనారాయణ, సలావుద్దీన్, ఆత్మ కమిటీ డైరెక్టర్ తొంట రాజు, రవి, పట్టణ పార్టీ యువత అధ్యక్షులు బిట్ల ప్రేమ్ కుమార్, గ్రామ శాఖ అధ్య క్షులు చోటు మియా, మాజీ ఎంపీటీసీ పండరి, కార్యదర్శి రేఖ, ఇందిర, సిద్ధన్న, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

మెషిన్ లెర్నింగ్‌పై అధ్యాపక వికాస కార్యక్రమం

నవతెలంగాణ-పటాన్‌చెరు

గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలోని ఈఈసీఈ విభాగం ఆధ్వర్యంలో ఈనెల 26, 28 తేదీలలో 'మెషిన్ లెర్నింగ్-ఇట్స్ అప్లికేషన్స్ ఇన్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ' అనే అంశంపై మూడు రోజుల అధ్యాపక వికాస కార్యక్రమాన్ని (ఎఫ్ఎపీ) నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు ప్రొఫెసర్ టి.మాధవి, ప్రొఫెసర్ కె.మంజునాథాచారి సోమవారం సంయుక్తంగా విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించారు. మెషిన్ లెర్నింగ్ అల్గారిథమ్‌లను ఇంజనీరింగ్, టెక్నాలజీకి ఎలా అన్వయించవచ్చో అర్థం చేసుకోవడానికి అవసరమైన జ్ఞానం, నైపుణ్యాలతో పాల్గొనే వారిని సన్నద్ధం చేయడానికి దీనిని రూపొం దించినట్టు వారు తెలిపారు. ఇందులో పాల్గొనేవారు ఆచరణాత్మక అవగాహనతో శిక్షణ పొందడమే గాక పరిశోధన సహకారం కోసం ఇతర గ్రూపుల సహకారం కోరవచ్చని చెప్పారు. మెషిన్ లెర్నింగ్ ప్రాథమిక లక్ష్యం కంప్యూటర్ సిస్టమ్ ను రూపొందించడం, డేటాలోని సంక్లిష్ట నమూనాలు, సంబంధాలను విశ్లేషించి అర్థం చేసుకోవడం, ఖచ్చితమైన అంచనాలను రూపొందించడానికి, చర్యలు తీసుకో వడానికి వీలు కల్పించడమన్నారు. ఈ పద్ధతులను వినియోగించి కొత్త సమస్యలను సులువుగా పరిష్కరించగలిగే ఆచరణాత్మక జ్ఞానాన్ని పొందచ్చని నిర్వాహకులు తెలియజేశారు. ఈ ఎఫ్ఎపీని విద్యావేత్తలు, పరిశోధన స్కాలర్లు, బీటెక్, ఎంటెక్, ఎమ్మెస్సీ చదివే వారికోసం ఉద్దేశించామని, ఆసక్తి ఉన్నవారు తమ పేర్లను ఈ లింక్ https://forms.gle/aimM5hby3LSUfxD8 లింక్ ద్వారా ఈనెల 26వ తేదీలోపు నమోదు చేసుకోవచ్చన్నారు. ఇతర వివరాల కోసం కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ రామ కృష్ణ 81060 21619ని సంప్రదించాలని, లేదా rpuvvula@gitam.eduకు ఈ-మెయిల్ చేయాలన్నారు.

వోక్సెన్ యూనివర్సిటీ మా భూములను లాక్కుంది



నవతెలంగాణ-మునిపల్లి

మండలంలోని కంకోల్ శివారులోని నేషనల్ హైవే పక్కన గల వోక్సెన్ యూనివర్సిటీ మరియు స్కూల్ యాజమాన్యం గత 20 ఏండ్లుగా తమ భూములు కబ్జా చేసి ఇబ్బందులకు గురి చేస్తోందని కంకోల్ గ్రామానికి చెందిన పలువురు రైతులు ఆరోపించారు. ప్రభుత్వమిచ్చి తమకిచ్చిన భూములను సదరు యాజమాన్యం లాక్కొని తమను ఇబ్బందులకు గురి చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కబ్జా విషయం తెల్సుకున్న తీన్మార్ మల్లన్న టీం రాష్ట్ర సభ్యులు రమేష్ గౌడ్ బాధితులతో కలిసి మునిపల్లి తహసీల్దార్ శివకుమార్‌కు వోక్సెన్ యజమాన్యంపై చర్యలు తీసుకోవాలని వినతి పత్రం అందజేశారు.

దిక్కున్న చోట చెప్పుకోమంటున్నారు

సర్వేనెంబర్ 236/ఇ లో ఎకరా 36 గుంటల భూమి మాకు వంశ పారపర్యంగా వచ్చింది. ఈ భూమిని కొన్నేండ్ల క్రితం కబ్జా చేసి.. భూ మి వద్దకు వెళ్లకుండా అడ్డుపడు తున్నారు. ఇదేంటని అడిగితే దిక్కున్న చోట చెప్పుకో అని నిర్లక్ష్య ంగా మాట్లాడుతున్నారు. మాకు న్యాయం చేయాలి.

- అంకుంట అడివమ్మ, బాధిత మహిళా రైతు

ఎకరా 36 గుంటల భూమిని కబ్జా చేశారు

కంకోల్ గ్రామానికి చెందిన నాకు సర్వేనెంబర్ 236/ఇ లో వంశ పారపర్యంగా 1.36 ఎకరాల ప్రభుత్వ భూమి వచ్చింది. అయితే ఈ భూమిని నాకు తెలియకుండానే వోక్సెన్ యాజమాన్యం కబ్జా చేసి.. భూమిలోకి వెళ్లకుండా అడ్డుకుం టోంది. ప్రభుత్వం వెంటనే స్పందించి న్యాయం చేయాలి.

- ఎల్లమ్మ హన్మయ్య, బాధిత రైతు

ఫీజుల దోపిడీని అరికట్టాలి

నవతెలంగాణ-సంగారెడ్డి



కార్పొరేట్, ప్రవేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడిని అరికట్టాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నల్లవల్లి రమేష్ డిమాండ్ చేశారు. సోమవారం ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాల యంలో సమావేశం నిర్వహించి.. ఆయన మాట్లాడారు. ప్రయివేటు కార్పొరేట్ స్కూల్స్‌లో ఒకటో తరగతి నుండి పదో తరగతి వరకు రూ.40,000 నుంచి రూ.2,00,000 వరకు విచ్చలవిడిగా ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. మరోపక్క బస్సు ఫీజు పేరుతో 4 కిలోమీటర్ నుంచి 10 కిలోమీటర్లు వరకు 20 వేల నుండి 30 వేల వరకు ఫీజులు దండుకుంటున్నారన్నారు. ఎల్‌కేజీ నుంచి టెన్త్ క్లాస్‌కి బుక్స్ యూనిఫామ్ పేరుతో రూ.8000 నుండి 2200 వరకు వసూలు చేస్తున్నారన్నారు. ప్రతి ఏటా బుక్స్ యూనిఫామ్స్ టై, బెల్ట్, బ్యాగ్, పేరుతో లక్షల రూపాయలు వసూలు చేస్తున్నారన్నారు. పేద మధ్యతరగతి విద్యార్థి తల్లి దండ్రుల దగ్గర నుంచి ఇలా విచ్చలవడిగా వసూలు చేయ డం సరికాదన్నారు. ఇంత జరుగుతున్నా.. విద్యాశాఖ అధికారులు పట్టి పట్టినట్లుగా వ్యవహరిస్తున్నారని మండపడ్డారు. ఫీజులు అధికంగా వసూలు చేస్తున్న విద్యాసంస్థ లపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే జిల్లాలో పర్మిషన్ లేకుండా అడ్మిషన్లు తీసుకుంటూ పాఠశా లలు నడిపిస్తున్న లిస్టును ప్రకటించి వారిపై చర్యలు తీసుకో వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షు లు మహేష్, సహాయ కార్యదర్శి రజినీకాంత్ ఉన్నారు.

బడులు పునః ప్రారంభం.. హాజరు శాతం అంతంతే



నవతెలంగాణ-నార్సింగి

తెలంగాణ రాష్ట్రంలో నేటి నుంచి బడులు పునః ప్రారంభం అయ్యాయి. నార్సింగి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తరగతి గదులను, మైదానాన్ని నార్సింగి గ్రామ పంచాయతీ కార్మికులు శుభ్ర పరిచారు. ఎండల వల్ల తొలి రోజు విద్యార్థుల హాజరు సంఖ్య చాలా తక్కువగా ఉంది. నార్సింగి ఉన్నత పాఠశాలలో మొత్తం 430 మంది విద్యార్థులకుగాను కేవలం 30 మంది హాజరయ్యారు. అధ్యాపకులు అందరూ హాజరవగా, ఇద్దరు ఉపాధ్యాయుల ట్రైనింగ్‌కు వెళ్ళారు. హాజరైన విద్యార్థులకు ప్రధానోపాధ్యాయురాలు నవీన జ్యోతి, అధ్యాపకులు స్వాగతం పలికారు, విద్యార్థులలో నూతనోత్సాహం నింపారు.

ధరణి ఆపరేటర్ల సంఘం జిల్లా కోశాధికారిగా సుమంత్



నవతెలంగాణ-తూప్రాన్ రూరల్ (మనోహరాబాద్)

మెదక్ జిల్లా ధరణి కంప్యూటర్ ఆపరేటర్ల ఉద్యోగుల సంఘం కోశాధికారిగా తూప్రాన్ ధరణి ఆపరేటర్ సుమంత్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మెదక్‌లో ధరణి టెక్నికల్ స్టాఫ్ అసోసియేషన్ యూనియన్ ఎన్నికలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ధరణి ఉద్యోగుల సంఘం కోశాధికారిగా తూప్రాన్ ధరణి ఆపరేటర్ సుమంత్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు తెలిపార. అధ్యక్షులుగా ఆశయ్య, ఉపాధ్యక్షులుగా కుమారస్వామి, లావణ్య, ప్రధాన కార్యదర్శిగా రవికుమార్, సహయ కార్యదర్శిగా మహేష్, సహయ కోశాధికారిగా రాజశేఖర్, కార్యవర్గ సభ్యులుగా విజయ్, జగన్, సలహాదారులుగా మల్లేష్, దేవెందర్, రాజు, ప్రసాద్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు సుమంత్ తెలిపారు. ధరణి ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం అందుబాటులో ఉండి కృషి చేస్తానని తెలిపారు.

అక్షయపాత్రకు అప్పగించి తమ పొట్టకొట్టొద్దు

- ఇరవై సంవత్సరాలుగా పిల్లలకు వంటచేసి పెడుతున్నాం
- వంటచేయడానికి లక్షల అప్పులు చేశాం
- ఎలాంటి డబ్బులు లేనపుడు కూడా వండి పెట్టాం
- తమకు తెలియకుండానే అక్షయపాత్రకు ఎలా అప్పగిస్తారు
- మొదటి రోజే విద్యార్థులను ఇంటికి పంపిన ఉపాధ్యాయులు
- మధ్యాహ్న భోజన కార్మికుల నిరసన





నవతెలంగాణ/తూప్రాన్ రూరల్ (మనోహరాబాద్)

తాము గత ఇరవై సంవత్సరాలుగా పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండిపెడుతున్నామని తమకు ఎలాంటి సమాచారం లేకుండా అక్షయ పాత్రకు అప్పగించారని అక్షయపాత్రకు అప్పగించి తమ పొట్టకొట్టొందంటూ సోమవారం మధ్యాహ్న భోజన కార్మికులు పాఠశాల ముందు నిరసన వ్యక్తం చేశారు. మనోహరాబాద్ మండలంలో ప్రైమరి పాఠశాలలు, యూపీఎస్‌లు కలిపి ఇరవై పాఠశాలలు ఉండగా జడ్పీహెచ్ఎస్ పాఠశాలలు 7 ఉన్నాయి. కాగా పాఠశాలలో మండలంలో సుమారు 88 మంది వరకు మధ్యాహ్న భోజన కార్మికులు పనిచేస్తున్నారు. ఇప్పటి వరకు పాఠశాలలో మధ్యాహ్న భోజనం వండిపెడుతున్న కార్మికులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే అధికారులు అక్షయ పాత్రకు అప్పగిస్తూ ఉత్తర్వులను జారీ చేశారు. దాంతో సోమవారం మధ్యాహ్న భోజన కార్మికులు పాఠశాలలకు వచ్చే సరికి వారికి ఈ రోజు నుంచి అక్షయపాత్రకు అప్పగించారని వండనక్కర్లేదని ఉపాధ్యాయులు తెలపడంతో వారు ఆవేదనకు గురయ్యారు. తాము గత ఇరవై సంవత్సరాలుగా విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని వండిపెడుతున్నామని తమకు ఎలాంటి సమాచారం లేకుండా అక్షయపాత్రకు అప్పగిస్తారని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు గతంలో ఎలాంటి వేతనం లేకుండానే విద్యార్థులకు వంటచేసి పెట్టామని అలాంటి తమను కాదని అక్షయపాత్రకు ఎలా అప్పగిస్తారని తెలిపారు. తాము ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి డబ్బులు వచ్చే వరకు తామే కిరాణ దుకాణాలలో పప్పులు, కూరగాయలు లాంటి నిత్యావసర వస్తువులను తీసుకు వచ్చి వండి పెట్టామని అలాగే కిరాణ దుకాణంలో ఇప్పటి వరకు సుమారు లక్షన్నర వరకు అప్పుగా ఉన్నామని ఆ డబ్బులు ఎవరు చెల్లిస్తారని వారు డిమాండ్ చేశారు. తామే మధ్యాహ్న భోజనం వండి పెడతామనే ఆలోచనతో వంట సామాగ్రిని, కట్టెలను వేల రూపాయలను వెచ్చించి భద్రపరుచుకున్నామని వాటి పరిస్థితి ఎంటని వారు తెలిపారు. ఇన్ని సంవత్సరాల నుంచి విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండి పెట్టిన తమకు న్యాయం చేయాలని అనవసరంగా అక్షయ పాత్రకు అప్పగించి తమ పొట్టకొట్టొద్దంటూ వారు డిమాండ్ చేశారు.

మొదటి రోజే విద్యార్థులకు అన్నం లేదు

పాఠశాలల వేసవి సెలవుల అనంతరం పున: ప్రారంభం కావడంతో మొదటి రోజే పాఠశాలలకు వచ్చిన విద్యార్థులకు మధ్యాహ్న భోజనం లేక ఇంటి దారిపట్టారు. మండలంలోని పాఠశాలలకు మధ్యాహ్న భోజనం కోసం అధికారులు అక్షయ పాత్రకు అప్పగించారు. అయినప్పటికి మొదటి రోజు అక్షయ పాత్ర నుంచి పాఠశాలలకు అక్షయపాత్ర నుంచి భోజనం రాలేదు. దాంతో పాఠశాల ముందు నిరసన తెలుపుతున్న మధ్యాహ్న భోజన కార్మికులను వంట చేసిపెట్టాలని ఉపాధ్యాయులు తెలపడంతో వారు వంట చేయడానికి నిరాకరించారు. దాంతో చేసేది లేక ఉపాధ్యాయులు మధ్యాహ్న భోజనం ఇంటి వద్ద చేసి రావాలని విద్యార్థులను ఇంటికి పంపించారు. కానీ అక్షయపాత్ర ద్వార పాఠశాలలకు మధ్యాహ్న భోజనం రావడానికి ఇంకా సమయం పడుతుందని పాఠశాలలోనే విద్యార్థులకు వంట చేసి పెట్టే విధంగా ఉపాధ్యాయులు చర్యలు తీసుకుని విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలని విద్యాశాఖ అధికారుల నుంచి ఆదేశాలున్నాయి. అయినప్పటికి పాఠశాలల ఉపాధ్యాయులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ విద్యార్థులను మధ్యాహ్న భోజనానికి ఇంటికి పంపించారు.

14న ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులకు సర్టిఫికెట్ల పరిశీలన



నవతెలంగాణ-సంగారెడ్డి

తెలంగాణ రాష్ట్ర పోలీసు నియామక ప్రక్రియలో భాగంగా తుది రాత పరీక్షలో అర్హత సాధించిన ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులకు సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ ప్రక్రియ ఈ నెల 14 నుంచి ప్రారంభమై 26 వరకు కొనసాగుతుందని జిల్లా ఎస్పీ రమణ కుమార్ తెలిపారు. అర్హత పొందిన అభ్యర్థులు సర్టిఫికేట్ వెరిఫికేషన్ లెటర్ తో పాటుగా సంబంధిత ధృవపత్రాలు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో పాటు ఒక జిరాక్స్ ప్రతిని తీసుకొని, తమకు కేటాయించిన రోజున, సమయానికి పోలీస్ కళ్యాణ మండపంలో హాజరు కావల్సి ఉంటుందన్నారు. మొత్తం 7065 అభ్యర్థుల సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ చేయనున్నట్లు ఎస్పీ రమణకుమార్ తెలిపారు.

తూప్రాన్‌లో టూకె రన్




నవతెలంగాణ-తూప్రాన్ రూరల్ (మనోహరాబాద్)

తెలంగాణ రాష్ట్ర ఆవతరణ అనంతరం రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాలతో చేపడుతున్న దశాబ్ది ఉత్సవాలలో భాగంగా సోమవారం పోలీసు శాఖ ఆధ్వర్యంలో టూకె రన్ కార్యక్రమాన్ని చేపట్టారు. తూప్రాన్ మున్సిపల్ పరిధిలో తూప్రాన్, మనోహరాబాద్ మండలాల్లోని నాయకులు యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. టూకెరన్ కార్యక్రమంలో గడ ప్రత్యేక అధికారి ముత్యంరెడ్డి, ఆర్డీవో శ్యాంప్రకాశ్, మున్సిపల్ చైర్మన్ బొంది రాఘవెందర్‌గౌడ్, తూప్రాన్ మండల పార్టీ అధ్యక్షులు బొల్లంపల్లి బాబుల్‌రెడ్డి, మనోహరాబాద్ మండల వైస్ ఎంపీపీ యంజాల విఠల్‌రెడ్డి, నాయకులు పంజా భిక్షపతి, పురం రవిముదిరాజ్‌లతో పాటు అధిక సంఖ్యలో నాయకులు యువకులు పాల్గొన్నారు. తూప్రాన్ పోలీసుల ఆధ్వర్యంలో చేపట్టిన టూకెరన్ స్థానిక బస్టాండ్ నుంచి పోతరాజ్‌పల్లి వరకు కొనసాగింది. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గడ ప్రత్యేక అధికారి ముత్యంరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ముందస్తు ఆలోచనతోనే రాష్ట్రం పూర్తిగా అభివృద్ధి చెందిందని ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు సైతం మన పథకాలను కాపీ కొట్టే స్థితికి వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ డీఎస్పి యాదగిరిరెడ్డి, సీఐ శ్రీధర్, ఎస్ఐ సురేష్‌కుమార్, మున్సిపల్ కమీషనర్ మోహన్, మనోహరాబాద్ నాయకులు పొట్టొల్ల వెంకట్‌గౌడ్‌లతో పాటు బీఆర్ఎస్ పార్టీ నాయకులు యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

జొన్నల కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్



నవతెలంగాణ-రేగోడ్

జొన్నలకు కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ అన్నారు. సోమవారం రేగోడు పిఎసిఎస్ కార్యాలయం వద్ద అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జొన్నలు పండించిన రైతులు కొనుగోలు కేంద్రాలలో జొన్నలకు క్వింటాలుకు మద్దతు ధర రూ.2,970 ల ధర ఉంటుందని తెలిపారు. కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ రాజు యాదవ్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎండి సర్దార్, బి ఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షులు రాచోటి సుభాష్, సర్పంచులు నర్సింలు, సిద్ధారెడ్డి, సుంకే రమేష్ ,సుమంతా వినోద్, ఎంపీటీసీ నర్సింలు, బి ఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు బుచ్చయ్య, బి ఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు వినోద్ కుమా ర్, మాజీ కోఆప్షన్ మొయిజుద్దీన్, నాయకులు కల్లేటి రాధా కిషన్ గుప్తా, భూమి రెడ్డి, బాలయ్య, నాగయ్య స్వామి ,గుర్నాథ్ రెడ్డి, కోట సంగప్ప, తహసీల్దార్ లక్ష్మణ్, ఎస్ఐ సత్యనారాయణ, ఏవో జావిద్, ఏఈఓలు వినీత్, సునీల్ పాల్గొన్నారు.

పెద్దశంకరంపేటలో బాలుడి ఆత్మహత్య



నవతెలంగాణ-పెద్దశంకరంపేట

పెద్ద శంకరంపేట పట్టణంలోని ఇందిరా కాలనీకి చెందిన సంకు శివకుమార్ (14) ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. పెద్దశంకరంపేట ఎస్సై బాలరాజ్ తెలిపిన వివరాల ప్రకారం పేటకు చెందిన సంకు శివకుమార్ ఇంటి లోపల నుంచి గడియ పెట్టుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు పేర్కొన్నారు. విషయం తెలిసిన వెంటనే అల్లాదుర్గం సీఐ జార్జ్. పేట ఎస్ఐ బాలరాజు పోలీస్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతుడి తండ్రి శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. బాలుడు శివకుమార్ ఆత్మహత్యకు కారణాలు తెలుసుకోవడం విచారణ చేస్తున్నామన్నారు. మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఆయన వివరించారు.

కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం



నవతెలంగాణ-నార్సింగి : నార్సింగి మండలం సంకాపుర్ గ్రామంలో దివ్యాంగులు సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. జిల్లా వి.హెచ్.పీ.ఎస్ కోశాధికారి రాయిలాపురం శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ మాట్లాడుతూ, కేసీఆర్ మంచి మనసుతో దివ్యాంగులకు వెయ్యి రూపాయల పెన్షన్ పెంచినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్‌తో పాటు గ్రామ వి.హెచ్.పీ.ఎస్ అధ్యక్షుడు బొడ కుమార్, దివ్యాంగులు మంగమ్మ, జగపతి, పోచయ్య, బాబు, బాలయ్య, లలిత, సరిత, కవిత తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ తహసీల్దార్ మాలతికి సన్మానం



నవతెలంగాణ-వెల్దుర్తి

మాసాయిపేట మండల తహసీల్దార్‌గా మాలతి గత కొంతకాలంగా విధులు నిర్వహిస్తూ అందరి చేత మన్ననలు పొందిన తహసీల్దార్ మాలతికి సోమవారం మాసాయిపేట మండల అఖిలపక్ష నాయకులు ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు మాసాయిపేట యాదగిరి మాదిగ, మాజీ సర్పంచ్ చిట్టిమిళ్ల నాగరాజు మాజీ ఎంపీటీసీ సభ్యులు పైతర అశోక్ పిఎసిఎస్ డైరెక్టర్ కోదండపురం నర్సింలు పూల దుర్గాస్వామి యాదవ సంఘం నాయకులు శంకర్ యాదవ్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఆవరణంలో శాలువలతో సన్మానించారు.

కీలక సమావేశానికి ప్రజాప్రతినిధుల గైర్హాజరు

- నామమాత్రంగా నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం
- గైర్హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు



నవతెలంగాణ-కొల్చారం

మండలంలోని అభివృద్ధి పనులపై సమీక్షించేందుకు మూడు నెలలకు ఒకసారి మండల సర్వసభ్య సమావేశం మండల పరిషత్ అధ్యక్షురాలి అధ్యక్షతన అధికారులు నిర్వహిస్తూ ఉంటారు. ఈ కీలకమైన సమావేశంలో ప్రజాప్రతినిధులు వివిధ శాఖల అధికారులు పూర్తిస్థాయిలో పాల్గొనాల్సిన అవసరం ఉంటుంది. కానీ కొల్చారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ మంజుల అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు పోటా పోటీగా గైర్హాజరు కావడంతో వెల వెలబోతున్న కుర్చీల నడుమ చదువింపుల ప్రక్రియగా ముగిసింది. ప్రజా సమస్యల పరిష్కారం కోసం చొరవ చూపేందుకు నిర్వహించే మండల సర్వసభ్య సమావేశాలు రోజు రోజుకు వాటి నిర్వహణ పట్ల ప్రజల్లో విశ్వాసాన్ని మరింత సన్నగిల్లేలా కొనసాగుతున్నాయని చెప్పుకోవచ్చు. ముఖ్యంగా మండల స్థాయి అధికారులు హాజరు కావాల్సిన సర్వసభ్య సమావేశంలో కింది స్థాయి సిబ్బంది వారి తరుపున హాజరు కావడంతో సమస్యలు పరిష్కారం చూపే వారు లేక కేవలం చదివింపుల ప్రక్రియగానే సమావేశం కొనసాగింది.

గురుకులాల్లో పార్ట్‌టైం టీచర్ పోస్టుల భర్తీ

నవతెలంగాణ-సంగారెడ్డి

సాంఘీక సంక్షేమ గురుకుల కళాశాల, పాఠశాలల్లో పార్ట్‌టైం టీచర్ పోస్టుల భర్తీ కోసం అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరబడుతుందని ప్రాంతీయ సమన్వయ అధికారి బీమయ్య తెలిపారు. అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. కళాశాలల్లో తెలుగు, గణితం, భౌతిక, రసాయన శాస్త్రం, వృక్ష, జంతు శాస్త్రం, పాఠశాలల్లో తెలుగు, హిందీ, ఇంగ్లీష్, గణితం, సైన్స్, సోషల్ పోస్టులతో పాటు పీటీ, పీడీలు, స్టాఫ్ నర్సు, అసిస్టెంట్ కేర్ టేకర్ పోస్టుల కోసం అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. ప్రస్తుతం పనిచేస్తున్న గెస్ట్ టీచర్లు కూడా ఖచ్చితంగా విద్యా అర్హతలతో డెమోకు హాజరుకావాలని తెలిపారు. తాత్కాలిక పద్ధతిన పోస్టుల్ని భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 15న కొండాపూర్ సాంఘీక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో డెమో నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం పనిచేస్తున్న గెస్ట్ టీచర్లు, కొత్తగా చేరేందుకు ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఉదయం 10 గంటలకు కొండాపూర్ గురుకుల పాఠశాలకు హాజరుకావాలన్నారు.

ఐటీసీ సంస్థ సేవలు అభినందనీయం

- రాష్ట్ర సర్పంచ్ల ఫోరం వర్కింగ్ ప్రెసిడెంట్ చిట్కుల్ మహిపాల్ రెడ్డి



నవతెలంగాణ-తూప్రాన్ రూరల్ మనోహరాబాద్

మారుమూల గ్రామాలలో సైతం ఐటీసీ సంస్థ అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం అభినందనీయమని రాష్ట్ర సర్పంచుల ఫోరం వర్కింగ్ ప్రెసిడెంట్ చిట్కుల్ మహిపాల్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మనోహరాబాద్ మండల కేంద్రంలో రాష్ట్ర సర్పంచుల ఫోరం వర్కింగ్ ప్రెసిడెంట్ మనోహరాబాద్ గ్రామ సర్పంచ్ చిట్కుల మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఐటీసీ సంస్థ సహకారంతో చెరువు కట్ట వెడల్పు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకవైపు తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ మిషన్ కాకతీయ పథకంతో చెరువుల పునరుద్దరణ చేపట్టినట్టు తెలిపారు. గ్రామాలలోని చెరువుల కట్టల వెడల్పు కార్యక్రమాలను ఐటీసీ సంస్థ చేపట్టడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఐలయ్య యాదవ్ వార్డ్ సభ్యులు మధుస్రి శోబాన్‌రాజ్ గౌడ్ హుమెరలయిాక్ బాలేష్ ప్యాక్స్ డైరెక్టర్ జావేద్ పాషా బీఆర్ఎస్ నాయకులు కిష్టా రెడ్డి రావెళ్లి కృష్ణ శంకర్ రవికుమార్, వెంకట్ రెడ్డి, మహేందర్, శంకర్ యాదవ్, మహిపాల్ గౌడ్, గోవర్ధన్ గౌడ్ సాయిబాబా మల్లేష్ ముదిరాజ్ షరీఫ్ నాగరాజు శ్రీశైలంయాదవ్ అశోక్, హన్మంతు రెడ్డి, నవీన్ మల్లేష్ నరేష్ గౌడ్ డాక్టర్ పాండు సాయి విఠల్ బాలెష్ పంచాయతీ సిబ్బంది యువకులు తదితరులు పాల్గొన్నారు.

పాల్లీఫామ్‌ను ప్రారంభించిన తిరుపతిరెడ్డి



నవతెలంగాణ-నిజాంపేట : మండల పరిదిలోని బచ్చురాజ్ పల్లి గ్రామంలో మండల కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షులు రామావత్ వినోద్ నూతన పౌల్ట్రీ ఫామ్‌ను సోమవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కంఠారెడ్డి తిరుపతి రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ మండల యూత్ అధ్యక్షులు వినోద్ పౌల్ట్రీ ఫామ్ నిర్మించుకోవడం శుభ పరిణామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగాలు భర్తీ చేసిన పాపనపోలేదన్నారు. అయినా నిరుద్యోగులు అధైర్య పడకుండా ఇలాంటి సొంత వ్యాపారాలు పెట్టుకుని పైకి రావలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు లింగం గౌడ్, ఉపాధ్యక్షులు జిట్టి మారుతి, జిల్లా వైస్ ప్రెసిడెంట్ పంజా మహేందర్, పట్టణ అధ్యక్షులు నసీరుద్దీన్, సేవ దళ్ అధ్యక్షులు ముత్యాల మధుసూదన్ రెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షులు కాకి రాజయ్య, నరేందర్, మధుసూదన్ రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, చింతలస్వామి, జిల్లా యువజన అధ్యక్షులు మహేందర్ రెడ్డి, నియోజకవర్గ యూత్ అధ్యక్షులు రమేష్ గౌడ్, రామచంద్ర గౌడ్, చింతల యాదగిరి, మహేష్, ఆకుల బాలయ్య, భూమా గౌడ్, సులేమాన్, స్వామి, బొమ్మెన మల్లేశం, పరశురాములు, సిద్ధరాములు, తదితరులు పాల్గొన్నారు.

విత్తన డీలర్ల దుకాణాలను తనిఖీ



నవతెలంగాణ-నిజాంపేట : నిజాంపేట్ మండలంలోని పలు విత్తన డీలర్ల దుకాణాలను మండల వ్యవసాయ అధికారి సతీష్ సందర్శించారు. ఈ సందర్భంగా వారు విత్తన రికార్డ్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మట్లాడుతూ ఈ వానకాలం సీజన్‌లో నిజాంపేట మండలంలోనీ రైతులందరికి కావాల్సిన అన్ని రకాల పంటల నాణ్యమైన విత్తనాల్ని అందుబాటులో ఉంచాలన్నారు. నకిలీ విత్తనాలను ఎట్టి పరిస్థితులలో అమ్మవద్దని హెచ్చరించారు. ప్రతి విత్తన డీలరు విత్తన స్టాక్ రిజిస్టర్లను, ధరల పట్టికలను నిర్వహించాలని తెలిపారు. అదేవిధంగా రైతులు కూడా లైసెన్స్‌డ్ డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలను కొనుగోలు చేసి రసీదు పొందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో విత్తన డీలర్లు పాల్గొన్నారు.

పేదింటి వధువుకు పుస్తె మట్టెలు అందజేత



నవతెలంగాణ-నిజాంపేట

నిజాంపేట్ మండల పరిధిలోని నందిగామ గ్రామంలో పేద కుటుంబానికి చెందిన బిజ్జ. మణెమ్మ దేవ య్యల కూతురు మార్త వివాహానికి నిజాంపేట మండల జెడ్పీటీసీ పంజా విజయ్ కుమార్ పుస్తె మట్టెలు అందించారు. ఈ సందర్భంగా వధువు తల్లిదండ్రులు పంజ.విజయ్ కుమా ర్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గుడ్ల దేవదాసు, ప్రశాంత్, బండారి బిక్షపతి, తదితరులు పాల్గొన్నారు

సోషల్ సర్వీస్ ఆర్గనైజర్ సభ్యుల ఆధ్వర్యంలో

మైనంపల్లి సోషల్ సర్వీస్ ఆర్గనైజర్ సభ్యుల ఆధ్వర్యంలో సోమవారం నిజాంపేట మండల పరిధిలోని నందిగామ గ్రామానికి చెందిన బిజ్జ దేవయ్య మణేమ్మ కూతురు లావణ్య వివాహానికి పుస్తె మట్టెలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మైనంపల్లి సోషల్ సర్వీస్ సభ్యులు నిజాంపేట జాల శ్రీకాంత్, లింగస్వామి, అంజిరెడ్డి, సిద్ధరాములు, శాంతికుమార్, గుడ్ల దేవదాస్, తదితరులు పాల్గొన్నారు.



వనదుర్గా ప్రాజెక్టులో మునిగి వ్యక్తి మృతి

నవతెలంగాణ-పాపన్నపేట : వనదుర్గా ప్రాజెక్టులో నీట మునిగి చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ విజయకుమార్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఒడిషా రాష్ట్రం రాయ్ గడ్ జిల్లాకు చెందిన శ్రీధర్ సబార్ (22) గత ఏడాది క్రితం బతుకు దెరువు కోసం సంగారెడ్డి జిల్లా పాశమైలారంలోని ఓ పరిశ్రమలో పని చేస్తున్నాడు. ఆదివారం తమ బంధువు అయినా బినోద్, ఇతర స్నేహితులతో కలిసి ఏడుపాయల ఆలయం వద్దకు వచ్చారు. దర్శనం తరువాత ఆలయ సమీపంలోని వనదుర్గా ప్రాజెక్టు వద్దకు వెళ్లి అక్కడ ఈత కోసం ప్రాజెక్టులోకి దిగారు. ఈ క్రమంలో శ్రీధర్ ప్రాజెక్టుపై నుంచి కిందికి దూకడంతో జారి నీటిలో పడి తలకి గాయమైంది. దీంతో వెంటనే అక్కడ ఉన్న తోటి స్నేహితులు గమనించి చికిత్స నిమిత్తం మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. మృతుడి బంధువు బినోద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రారంభమైన పాఠశాలలు

మొదటిరోజు అంతంత మాత్రమే హాజరు



నవతెలంగాణ-నంగునూరు

నంగునూరు మండలంలోని వివిధ గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు సోమవారం ప్రారంభమయ్యాయి. బడులు తెరిచిన రోజు పుస్తకాల పంపిణీ చేస్తామనే మాటలు అమలు కాలేదు. ఎండలు తీవ్రంగా ఉండటం వల్ల మొదటి రోజు పాఠశాలలకు అంతంత మాత్రమే హాజరయ్యారు. సమయానికి బస్సులు లేకపోవడంతో గ్రామీణ ప్రాంతాలకూ చెందిన విద్యార్థులు మొదటి రోజు హాజరు కాలేదు. మన ఊరు మన బడిలో చేపట్టిన పనులు పాఠశాలలు ప్రారంభించడానికి ముందే తయారవుతాయనే మాటలు ఎక్కడ అమలు కాలేదు. గతంలో పది ప్రాథమిక పాఠశాలలు, ఒక ఉన్నత పాఠశాలను విద్యార్థులు లేకపోవడంతో మూసివేశారు. ఈ సారి కూడా ఎన్ని పాఠశాలలు మూత పడుతాయో వేచి చూడాల్సిందే. మూసిన పాఠశాలల ఉపాధ్యాయులను నంగునూరు మండలంలోని సర్దుబాటు చేశారు. దీంతో ఉపాధ్యాయుల కొరత తీరింది. నంగునూరు మండలంలో మొదటి రోజు 30 శాతం విద్యార్థులు హాజరైనట్లు సీఆర్పీలు వెల్లడించారు. మండల కేంద్రానికి సరఫరా అయినా పుస్తకాలను ఆయా పాఠశాలలకు పంపిణీ చేస్తామని తెలిపారు.

పరుగుతో శారీరక దృఢత్వం

నవతెలంగాణ-దుబ్బాక : ప్రతి ఒక్కరూ తమ దైనందిత జీవితంలో వ్యాయామం, నడక, పరుగును అలవర్చుకోవాలని తద్వారా శారీరక దృఢత్వాన్ని పెంపొందించుకోవచ్చునని మున్సిపల్ చైర్ పర్సన్ గన్నె వనిత భూమిరెడ్డి చెప్పారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పోలీసు శాఖ ఆధ్వర్యంలో దుబ్బాక పట్టణ కేంద్రంలోని తెలంగాణ తల్లి కూడలి నుండి చేర్వాపూర్ వార్డు మారెమ్మ దేవాలయం వరకు సోమవారం నిర్వహించిన '2 కే రన్' కార్యక్రమానికి మున్సిపల్ చైర్ పర్సన్ వనిత పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ, ప్రజలు తమ ఆరోగ్యాలను పటిష్టపర్చుకునేందుకు ప్రతిరోజు వ్యాయామం, నడక, పరుగు, యోగా వంటి వాటిని అలవర్చుకోవాలని సూచించారు. తద్వారా మానసిక, శారీరక దృఢత్వాన్ని పెంపొందించుకోవచ్చన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. దుబ్బాక ఎస్ఐ బత్తుల మహేందర్, భూంపల్లి ఎస్ఐ గంగరాజు, మిరుదొడ్డి ఎస్ఐ శ్రీధర్, 17వ వార్డు కౌన్సిలర్ పులిగారి కల్పన ఎల్లం, 9వ వార్డు కౌన్సిలర్ బత్తుల స్వామి, నాయకులు ఎంగారి రాజిరెడ్డి, పలువురు పట్టణవాసులు పాల్గొన్నారు.



పేదల పెన్నిధి సీఎం కేసీఆర్

నవతెలంగాణ-దుబ్బాక రూరల్

సీఎం కేసీఆర్ మంచి మనసున్న పేదల పెన్నిధి అని తెలంగాణ పద్మశాలి సంఘం రాష్ట్ర కన్వీనర్ బూర మల్లేశం అన్నారు. మండలంలోని రామక్కపేటలో సోమవారం ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు చేసే ఆర్థిక సహాయం పథకంలో పద్మశాలీల అవకాశం కల్పించడం సంతోషకరమని వారు అన్నారు. బీసీలతో పాటు అనేక మంది పేద, మధ్య తరగతి చేనేత, పద్మశాలి కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించాలని.. గతంలో తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం పక్షాన తాము తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌ని కోరామని గుర్తు చేశారు. పద్మశాలి, చేనేతల ఆర్థిక అభివృద్ధికి ఈ పథకం దోహదపడుతుందన్నారు. ఈ ఆర్థిక సహాయం రావడానికి కృషి చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్, బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్, ఆర్థిక మంత్రిహరీశ్‌రావులకు వారు తెలంగాణ చేనేత పద్మశాలి పక్షాన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పేర్ల పురుషోత్తం, రాష్ట్ర ప్రచార కార్యదర్శి శ్రీరామ్ రామకృష్ణ ప్రభు, రాష్ట్ర నాయకులు వనం సుమన్, వీరభద్రయ్య, అల్లి గోవింద్, గోలి జనార్ధన్, బాలరాజు, బాలయ్య యాదగిరి పాల్గొన్నారు.



దివ్యాంగుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి

- దివ్యాంగుల మండల అధ్యక్షుడు నర్సా గౌడ్

నవ తెలంగాణ మిరుదొడ్డి : దివ్యాంగుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయడం హర్షణీయమని దివ్యాంగుల సంఘం మండల అధ్యక్షుడు నర్సాగౌడ్, రాజేశ్వర్ అన్నారు. ప్రభుత్వం వికలాంగులకు రూ.4016 ఇస్తానని ప్రకటించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. మిరుదొడ్డి మండల కేంద్రంలో దివ్యాంగులు ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. వికలాంగులకు చేయూతను అందించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి కేసీఆర్ వికలాంగుల పెన్షన్ మరో వెయ్యి రూపాయలు ఆదనంగా పెంచుతూ 4016 ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న వికలాంగులకు ప్రభుత్వం చేయూతను అందించడం సంతోషంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి కెసిఆర్ తీసుకున్న నిర్ణయంతో తమ జీవితాల్లో నూతన వెలుగులు నిండాయన్నారు. అనంతరం వికలాంగులు ఒకరికొకరు స్వీట్లు పంచుకొని సంతోషం వ్యక్తం చేశారు దుర్గయ్య రాజేశ్వర్ రాజు తదితరులు పాల్గొన్నారు.



కరాటేలో ఆర్ట్స్ ఆఫ్ డిఫెన్స్ అకాడమీ ఇండియా విద్యార్థుల ప్రతిభ



నవతెలంగాణ-దుబ్బాక

దుబ్బాక పట్టణ కేంద్రానికి చెందిన ఆర్ట్స్ ఆఫ్ డిఫెన్స్ అకాడమీ ఇండియా విద్యార్థులు కరాటేలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి నాలుగు గోల్డ్ మెడల్స్, ఒక సిల్వర్ మెడల్ సాధించినట్లు కరాటే మాస్టర్ బురాని శ్రీకాంత్ తెలిపారు. హైదరాబాద్‌లోని సూరారం బ్లూమ్మింగ్ బర్డ్స్ పాఠశాలలో ఆదివారం జరిగిన మొదటి రాష్ట్రస్థాయి కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో అండర్ 12 విభాగంలో దుబ్బాక విద్యార్థులు ఎంగారి వర్షిని, సామలేటి మనస్విని,మాదరి హర్షవర్ధన్, దేమ హాసిని లు ఈ మెడల్స్ సాధించినట్లు వెల్లడించారు.

పాఠశాలను తనిఖీ చేసిన జిల్లా విద్యాధికారి



నవతెలంగాణ- గజ్వేల్

జిల్లావిద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి సోమవారం ప్రజ్ఞాపూర్‌లోని ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. ప్రధానోపాధ్యాయులు మదనాలు శ్రీనివాస్‌ను విద్యార్థుల ఎన్రోల్మెంట్ గురించి అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన వివరాల గురించి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనం కొత్త మెనూ వచ్చింది ప్రకారం చేసుకోవాలని తెలిపారు. ఉపాధ్యాయులు వెంకటమ్మ ప్రేమలత, బాలస్వామి లైబ్రరీ కోఆర్డినేటర్ సునీత పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నవతెలంగాణ-చేర్యాల

చేర్యాల మండలం కడవేరుగు గ్రామంలోని హైస్కూలులో 1989-90లో చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని మండల కేంద్రంలోని ఓ గార్డెన్‌లో ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. 33 సంవత్సరాల తర్వాత కలుసుకోవడం చాలా సంతోషంగా ఉందని ఈ సందర్భంగా ఒకరినొకరు పలకరించుకుంటు చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామచంద్రం, గుస్క రాందాస్, బుస్స శ్రీనివాస్, పూర్వ విద్యార్థులు తాళ్లపల్లి రమేష్, బుస్స భాస్కర్, శివ కుమార్, కిష్టయ్య, అయిల్ రెడ్డి, బ్రహ్మాచారి, శెట్టి పల్లి సత్తిరెడ్డి, సాంబయ్య, రాములు పాల్గొన్నారు.

ముదిరాజులకు లక్ష సాయం వర్తింపజేయాలి



నవతెలంగాణ-గజ్వేల్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బీసీ కుల వృత్తులకు లక్ష ఆర్థిక సహాయం పథకం ముదిరాజ్ కులానికి కూడా వర్తింపచేయాలని ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు గుంటుకు శ్రీనివాస్ కోరారు. సోమవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన జాబితాలో ముదిరాజ్‌లు లేకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వం వెంటనే ముదిరాజ్ కులాన్ని కూడా జాబితాలో చేర్చి పథకం అమలయ్యేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిట్ల ఆంజనేయులు ,చింత శ్రీనివాస్, కొట్టాల శ్రీనివాస్,గుంటుకు యాదగిరి, కేశమైన బాస్కర్, పిట్ల నరేష్, కాళ్లబాను తదితరులు పాల్గొన్నారు.

మత్స్య కారులకు ఉపాధి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం

- జిల్లా మత్స్య శాఖ శాఖ అధికారి



నవతెలంగాణ-నంగునూరు

మత్స్య కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని జిల్లా మత్స్య శాఖ అధికారి మల్లేశం అన్నారు. సోమవారం రాష్ట్ర ఆయిల్ ఫామ్ సొసైటి రైతు ఉపాధ్యక్షుడితో కలసి నంగునూరు మండలంలోని గట్లమల్యాల పెద్ద చెరువులో మత్స్యకారుల సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. అర్హులైన మత్స్య కార్మికులకు వృత్తి నైపుణ్య పరీక్షలు నిర్వహించి మాట్లాడారు. మండలంలో నీటి విస్తీర్ణం పెరగడంతో 18 సంవత్సరాలు నిండిన ప్రతి మత్స్య కార్మికునికి సభ్యత్వం కల్పించాలని ఉద్దేశంతో వృత్తి నైపుణ్యంపై పరీక్షలు నిర్వహించామని తెలిపారు. ప్రతి ఒక్కరు వృత్తిపై అవగాహన పెంచుకుంటే జీవనోపాధికి దోహద పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షులు కర్ణకంటి రేణుక వేణుగోపాల్, గ్రామ సర్పంచ్ తిప్పని రమేష్, మత్స్య శాఖ సిబ్బంది, గ్రామ శాఖ మత్స్యశాఖ అధ్యక్షుడు ద్యాగల శ్రీనివాస్,అశోక్, ప్రవీణ్, కిష్టయ్య, మాజీ ప్రజాప్రతినిధులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్ అందజేయాలి



- ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రెడ్డమైన అరవింద్

నవతెలంగాణ - సిద్దిపేట

విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్ వెంటనే అందజేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రెడ్డమైన అరవింద్ డిమాండ్ చేశారు. విద్యా సంవత్సరం ప్రారంభమైన సందర్భంగా పట్టణంలోని మల్టీపర్పస్ హైస్కూల్లో ఆయన వివిధ అంశాలపై విద్యార్థులతో సర్వే చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సంవత్సరం ప్రభుత్వం విద్యార్థులకు నోటు పుస్తకాలు ఇస్తామని ప్రకటించారని, వెంటనే అందరికీ అందించాలని, రాగి జావతో ఉదయం పూట అల్పాహారం ఇవ్వడం జరుగుతుందని, దానికి సంబంధించిన ఖర్చు ప్రభుత్వం భరించాలన్నారు. కిచెన్ గది సరిపోవడం లేదన్నారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో స్కావెంజర్స్ నియమించాలన్నారు. మధ్యాహ్న భోజనానికి సంబంధించిన కూరగాయలు డిస్ట్రిక్ట్ ఆఫీసర్స్ సప్లై చేస్తామని ప్రకటన చేశారని, అది ఎప్పటి నుంచి అమలు చేస్తారో తెలియజేయాలని కోరారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్స్‌లో మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనాన్ని అందించాలన్నారు. అల్పాహారంగా రాగిజావతోపాటు అరటిపండు, పాలు కూడా అందించాలన్నారు. బడిబాట ద్వారా సిద్దిపేట జిల్లాలో 4613 అడ్మిషన్ అయినాయని డీఈవో చెప్పడం జరిగిందని, ఈ విషయంపై డీఈవో చర్చకు సిద్ధమేనా అని ప్రశ్నించారు. వాస్తవానికి అన్ని అడ్మిషన్ జరగలేదని ఉపాధ్యాయులు చెప్పారని అన్నారు. ఎండలు తీవ్రంగా ఉన్నందున నాలుగైదు రోజులు మధ్యాహ్నం వరకు క్లాసులు నడిపించాలని డిమాండ్ చేశారు.

ఉత్సాహంగా హుస్నాబాద్‌లో 3కే రన్

- పరుగుల తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు
- పాల్గొన్న హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీష్ కుమార్

నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా హుస్నాబాద్‌లో సోమవారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 3కే రన్ నిర్వహించారు. 3 కే రన్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే సతీష్ కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పోలీసు శాఖ ఆధ్వర్యంలో హుస్నాబాద్ లో గతంలో కూడా పరుగు పందాలు నిర్వహించారన్నారు. యువత, పిల్లలు, పెద్దలు ఉత్సాహంగా పాల్గొని తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాలలో తెలంగాణ రన్‌ను విజయవంతంగా నిర్వహించుకున్నామని సంతోషం వ్యక్తం చేశారు. హుస్నాబాద్ లో ప్రగతి అభివృద్ధి పరుగులు పెడుతుందన్నారు. ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తామని అన్నారు. ఈ పరుగులో బిఆర్ఎస్ పార్టీ యువ నాయకులు ఇంద్రనీల్ బాబు పాల్గొని యువతలో ఉత్సాహం నింపారు. ఈ సందర్భంగ్గా మాట్లాడుతూరీ పదేళ్ల సాధించిన ప్రగతి రన్ రూపంలో దూసుకుపోతుందన్నారు. దశాబ్దిలోనే శతాబ్దికి సరపడా సంక్షేమ పరుగు తెలంగాణ ఖ్యాతిని నూరేళ్ల పాటు శాశ్వతంగా నిలిచేలా ఉందన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల పరుగు ఇక ఎవరూ ఆపలేని పరుగు రోజురోజు వేగం పుంజుకుంటుందన్నారు. అనంతరం రన్నింగ్ లో రాణించిన విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ ఏసిపి సతీష్, హుస్నాబాద్ సిఐ ఎర్రల కిరణ్, ఎస్ ఐ మహేష్, మున్సిపల్ చైర్మన్ ఆకుల రజిత వెంకన్న, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ రాయిరెడ్డి రాజారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ ఐలేని అనిత రెడ్డి, పిడి బూట్ల రాజ మల్లయ్య, కౌన్సిలర్ లు బోజు రమాదేవి రవీందర్, పెరుక భాగ్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సీఎం కేసీఆర్ కృషితో దశాబ్ది అభివృద్ధి



- మెదక్ ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి

నవతెలంగాణ- గజ్వేల్

ముఖ్యమంత్రి కేసీఆర్ కృషితోనే దశాబ్ది ఉత్సవాలు నిర్వహించుకుంటున్నామని మెదక్ ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి అన్నారు. సోమవారం ఆయన ఇంటిలో విలేకరులతో మాట్లాడుతూ గత తొమ్మిది సంవత్సరాలుగా ఉమ్మడి మెదక్ జిల్లా ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. సాగునీటి ప్రాజెక్టులతో జిల్లా సస్యశ్యామలంగా మారిందన్నారు. కొండపోచమ్మ, మల్లన్న సాగర్ జలాశయాలు రైతు సంక్షేమం కోసం నిర్మించినట్లు గుర్తు చేశారు. గతంలో ఏ ప్రభుత్వం కూడా రైతు సంక్షేమం పట్టించుకోలేదన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో 60 సంవత్సరాలు తెలంగాణ నష్టపోయిందన్నారు. 2014లో ఏర్పడ్డ తెలంగాణ ప్రభుత్వం దశలవారీగా అభివృద్ధి చేపడుతుందన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అభివృద్ధి శర వేగంగా జరుగుతుందన్నారు. ఇందులో భాగంగానే గజ్వేల్ నియోజకవర్గం మొదటి స్థానంలో ఉందన్నారు. రెండుసార్లు గజ్వేల్ నుండి శాసనసభ కు కెసిఆర్ పోటీ చేసి ముఖ్యమంత్రి అయ్యారన్నారు. మంత్రి హరీష్ రావు ప్రత్యేక దృష్టి పెట్టినట్లు ఆయన చెప్పారు.

ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య

నవతెలంగాణ-మిరుదొడ్డి

ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యా బోధన అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయడం జరుగుతుందని ఎంపీపీ సాయిలు, ఎంఈఓ ప్రభుదాస్ అన్నారు. సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండల కేంద్రంలో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు పాఠ్యపుస్తకాలు అందజేశారు. పాఠశాల పున ప్రారంభం రోజు నాడే పాఠశాలలకు పుస్తకాలు అందించడం జరిగిందన్నారు. మండలంలోని 22 ప్రాథమిక, ఉన్నత పాఠశాలలకు 86 శాతం పాఠ్యపుస్తకాలు ప్రభుత్వం తొలి విడతగా అందించిందన్నారు. రెండో విడతలో పూర్తిస్థాయిలో విద్యార్థులకు త్వరలోనే పుస్తకాలు ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. గ్రామస్థాయిలో ఉన్న ప్రజా ప్రతినిధులతో కలిసి ఉపాధ్యాయులు విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన, గుణాత్మక విద్య అందుతుందని తెలిపారు. ప్రైవేటు పాఠశాలలోకి విద్యార్థులను తల్లిదండ్రులు పంపించి ఆర్థికంగా ఇబ్బందులకు గురికావద్దన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సుకురి లింగం, కో ఆప్షన్ సభ్యులు హైమద్, ప్రధానోపాధ్యాయుడు రాజిరెడ్డి , వెంకట్ రెడ్డి, నర్సింలు, మహేష్ పలువురు పాల్గొన్నారు.



ఈత కొలనులా కూడవెల్లి వాగు







నవతెలంగాణ-తొగుట

మండలంలోని వెంకట్రావు పేట శివారులో గల కూడవెల్లి వాగు ఈ మధ్య కాలంలో సిమ్మింగ్ పూల్‌టా మారింది. గతంలో ఈ సమయం వచ్చే సరికి చుక్క నీరు ఉండేది కాదు. మల్లన్నసాగర్ నిర్మాణం తరువాత వాగు జీవ నదిలా మారింది. పిల్లలకు పాఠశాలలు సెలవులు కావడంతో వారికి ఇత నేర్పించాలనే ఉద్దేశం ప్రతి రోజు వాగులో ఇత నేర్చుకునే వారు అధిక సంఖ్యలో రావడంతో సందడిగా మారింది. చిన్న, పెద్ద అనే తేడా లేకుండా వెంకట్రావుపేట గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు సైతం వాగులో ఇత కొట్టడం సరదాగా మారింది. పట్టణాలలో సిమ్మింగ్‌పూల్ నిర్మాణం చేసి అక్కడ సరదాగా గడుపుతారు. మల్లన్నసాగర్ నీటితో జీవనదిలా మరిన కూడవెల్లి వాగులో ఈత నేర్చుకునే వారు, నేర్పేవా రు, సరదాగా ఈత కొట్టేవారు చాలామంది వస్తున్నారు.

10 సంవత్సరాలలో అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ముందుకు

- ఏది ఏమైనా ఇంటింటికి నీళ్లు ఇవ్వాల్సిందే
- హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో 10 సంవత్సరాల కాలంలో హుస్నాబాద్ నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలలో ముందుకు వెళ్తున్నామని హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ అన్నారు. సోమవారం హుస్నాబాద్‌లో ఎంపీపీ లకావత్ మానస అధ్యక్షతన మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే సతీష్ కుమార్ మాట్లాడుతూ వివిధ శాఖలపై అభివృద్ధి పనుల తీరుపై చర్చించారు. పోతారం ఎస్ గ్రామంలో మిషన్ భగీరథ నీరు రావడం లేదని ఎంపీటీసీ శ్రీనివాస్ మిషన్ భగీరథ ఇంట్రా డీఈఈ రుహీనా తస్కీన్‌ని నిలదీశాడు. మిషన్ భగీరథలో నీటి సమస్య పరిష్కరించడంలో డిఈఈ పట్టించుకోవడం లేదన్నారు. దీంతో ఎమ్మెల్యే సతీష్ కుమార్ డీఈఈపై ఆగ్రహ వ్యక్తం చేశారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో ఎక్కడ ఎలాంటి సమస్య ఉన్న వెంటనే పరిష్కరించాలని, పోతారంలో మిషన్ భగీరథ నీటి సమస్య ఉండడం ఏంటని మండి పడ్డారు. ఎక్కడ లేని సమస్య పోతారం గ్రామంలోనే ఎందుకు వచ్చిందని, గ్రామంలో ఎలాంటి సమస్యనైన పరిష్కరించేందుకు అవసరమైన నిధులు వెంటనే ఇస్తామన్నారు. రేపటిలోగా సమస్య పరిష్కారం కోసం గ్రామానికి వెళ్లి పనులు చేయించాలని డీఈఈని ఆదేశించారు. ఎక్కడ కూడా నీటి సమస్య రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత అధికారులు, ప్రజా ప్రతినిధులపై ఉందన్నారు. హుస్నాబాద్ మండలంలో 3 ఎంపీటీసి పరిధి గ్రామాలను కలుపుతున్నామని, హుస్నాబాద్‌లో ఎంపిటిసి స్థానాలు కూడా పెరుగుతున్నాయని అన్నారు. మండలంలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత అన్ని శాఖలకు అభివృద్ధి పనుల కోసం అవసరమైన నిధులు కేటాయించుకున్నామని వాటిని సక్రమంగా వినియోగిస్తూ గ్రామాల రూపు రేఖలు మార్చామన్నారు. ఈ అభివృద్ధి నిరంతరం ఇలాగే కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ లకవత్ మానస సుభాష్, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ రాయిరెడ్డి రాజారెడ్డి, మార్కెట్ చైర్మన్ ఎడబోయిన రజిని తిరుపతిరెడ్డి, ఎంపీడీవో కుమారస్వామి, సర్పంచ్‌లు తోడేటి రమేష్, భక్తుల మల్లయ్య, పిట్టల సంపత్, బత్తుల సునీత, దేవశాని సుశీల , దుండ్ర భారతి, ఎంపీటీసీలు అధికారులు పాల్గొన్నారు.

తెలుగు సాహిత్యంలో చిరస్మరణీయులు సినారె



నవతెలంగాణ - సిద్దిపేట

తెలుగు సాహిత్యంలోని అనేక ప్రక్రియలలో రచనలు చేస్తూ, తెలుగు భాషకు వైభవం తెచ్చిన తేజోమయుడు డాక్టర్ సి.నారాయణరెడ్డి అని ప్రముఖ బాలసాహితీవేత్త ఉండ్రాళ్ళ రాజేశం అన్నారు. సినారె ఆరవ వర్ధంతి సందర్భంగా సోమవారం సిద్దిపేటలో జరిగిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసిన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో కవిత్వం, గజల్, పద్యం తదితర ప్రక్రియల్లో పుస్తకాలు రచించి, సినీ రంగంలో వేలాది పాటలు రాయడమే కాకుండా, రాజ్యసభ సభ్యులుగా సేవలందించిన సినారె ఆదర్శప్రాయులని అన్నారు. సాహిత్యంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన జ్ఞానపీఠ్ పురస్కారంతో పాటుగా సాహిత్య అకాడమీ అవార్డు అందుకున్న గొప్ప కవిగా సి.నారాయణరెడ్డి బాటలో యువ కవులు కదలాలని, సినారె రచనలు సిద్దిపేట కవులకు ఎంతగానో స్ఫూర్తి నింపి సినారె ఆదర్శంగా నిలిచారన్నారు. తెలుగు సాహిత్యంలో ఆయన రచనలు అజరామరమన్నారు. ఈ కార్యక్రమంలో కవులు శ్రీచరణ్ సాయిదాస్, బెజుగామ శ్రీనివాస్, మల్లంల కనకయ్య, కళ్లెం లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు ఎల్లప్పుడు అండగా ఉంటా

- దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి.



నవతెలంగాణ-రాయపోల్

కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని, అధైర్య పడవద్దని దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. రాయపోల్ మండలం వడ్డేపల్లి గ్రామంలో కాంగ్రెస్ సీనియర్ కార్యకర్త నిరుడి నరసింహులు మాతృమూర్తి నర్సవ్వ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న నర్సింలు కుటుంబాన్ని సోమవారం పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సింలుకు మాతృవియోగం కలగడం బాధాకరమని నరసమ్మ మృతి పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అధైర్య పడవద్దు ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తప్పటి సుధాకర్, గుంటి నర్సింలు, నిరుడు నరసింహులు, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బైరాన్‌పల్లిలో ఉపాధి హామీ కూలీకి గాయాలు



నవతెలంగాణ-మద్దూరు

ఉపాధి హామీ పనిచేసున్న ఓ కూలికి గాయాలైన సంఘటన దూళ్మిట్ట మండలంలోని బైరాన్ పల్లి గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన దాసరి ప్రభాకర్ ఉపాధి హామీ చట్టం పనిలో ఉపాధి కూలీ పనికి వెళ్తూ రోజు మాదిరిగానే జరిగే పనుల్లో గొర్ల మల్లయ్య వ్యవసాయ భూముల్లో చదును చేస్తుండగా గడ్డపార తన కాలిపై పడడంతో తీవ్ర గాయమైంది. వెంటనే ఫీల్డ్ అసిస్టెంట్ ఉమేష్ స్థానిక వైద్యున్ని పిలిపించి ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం ప్రభాకర్‌ను చేర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

గ్రామపంచాయతీ భవనాన్ని వెంటనే నిర్మించాలి



నవతెలంగాణ-మద్దూరు

మండలంలోని లద్నూరు గ్రామంలో ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి గ్రామపంచాయతీ నిర్మాణానికి శంకుస్థాపన చేసి నెలలు గడుస్తున్నా స్థానిక పాలకవర్గం సభ్యులు గ్రామపంచాయతీ నిర్మాణం పనులను చేపట్టడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని బీజేవైఎం జిల్లా కార్యదర్శి సోగాల మనోజ్ కుమార్ ఆరోపించారు. గ్రామ పంచాయతీ భవనం శిథిలావస్థలో లేకపోయినా స్థానిక పాలకవర్గం సభ్యులు గ్రామపంచాయతీ భవనాన్ని కూలగొట్టడంతో జనగాం ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి నూతన గ్రామపంచాయతీ భవనానికి శంకుస్థాపన చేసి నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు స్థానిక పాలకవర్గం సభ్యులు నూతన గ్రామపంచాయతీ నిర్మాణం పనులను చేపట్టడం లేదన్నారు. ఎమ్మెల్యేనే ప్రారంభించిన నిర్మాణం పనుల్లో పాలకవర్గం సభ్యులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆయన అన్నారు ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకొని గ్రామపంచాయతీ భవనం నిర్మాణం పనులను త్వరగా చేపట్టాలని ఆయన కోరారు ఈ కార్యక్రమంలో రవీందర్ రెడ్డి, కృష్ణారెడ్డి ,వీరన్న, తదితరులు పాల్గొన్నారు

అమర్నాథ్ వెళ్లే లారీలకు నేడు మంత్రి ప్రత్యేక పూజలు

- అమర్నాథ్ అన్నదాన సేవా సమితి అధ్యక్షులు ఉప్పల భూపతి



నవతెలంగాణ-సిద్దిపేట

అత్యంత మహిమాన్వితమైన, ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన తీర్థయాత్రలో అమర్నాథ్ యాత్ర ఎంతో పవిత్రమైందని, అక్కడికి వచ్చే భక్తులకు దక్షణాది రుచులను చూపించడానికి సరుకులను తీసుకెళ్లే లారీలకు మంత్రి హరీశ్‌రావు ప్రత్యేక పూజలు చేసి మంగళవారం పంపిస్తారని అమర్నాథ్ అన్నదాన సేవా సమితి అధ్యక్షులు ఉప్పల భూపతి తెలిపారు. అమర్నాథ్ అన్నదాన సేవాసమితి ఆధ్వర్యంలో చేపట్టే కార్యక్రమాల కరపత్రాన్ని స్థానిక ప్రెస్ క్లబ్ లో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జులై 1 నుంచి 62 రోజులపాటు సాగే అమర్నాథ్ యాత్ర భక్తులకు భోజన వసతి కల్పించడం తాము చేసుకున్న పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నామన్నారు. అమర్నాథ్ యాత్రకు వెళ్లే భక్తుల కోసం అమృత్సర్ సహకారంతో బాల్తాల్ వద్ద, భోలే బండారి చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో పంచతరని వద్ద ప్రత్యేక లంగర్లు ఏర్పాటు చేసి భోజన వసతి కల్పిస్తున్నామన్నారు. శరబేశ్వర ఆలయం నుంచి లారీలు బయలుదేరుతున్నాయని, ఈ సరుకుల లారీని మంత్రి హరీశ్ రావు జెండా ఊపి ప్రారంభిస్తారన్నారు. శివ కల్యాణోత్సవం, 11 గంటలకు వాహన పూజ కార్యక్రమంతో పాటు అన్నదాన కార్యక్రమం ఉంటుందని. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. అలాగే అమర్నాథ్ వెళ్లే భక్తులందరూ బాల్తాల్ వద్దగల 8వ నెంబర్ లంగర్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో కైలాసం, మధుసూదన్ పరమేశ్వర్, రమేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రతిభను చాటి పారితోషికం అందుకున్న కవులు



నవతెలంగాణ-చేర్యాల

రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి జిల్లా కేంద్రంలోని విపంచి కళానిలయంలో తెలంగాణ అభివృద్ధిపై నిర్వహించిన కవి సమ్మేళనంలో చేర్యాలకు చెందిన కవులు మంగళగిరి రామచంద్ర మూర్తి, ఉప్పల ప్రభాకర్, ఎలికట్టె అయిలయ్య, విష్ణుమూర్తి, మనోహర్, భీపాల్ తమ కవితలకుగాను రాష్ట్ర ప్రభుత్వం అందించిన పారితోషికం, ప్రశంసాపత్రం, మెమెంటోను జిల్లా పరిషత్ చైర్ పర్సన్ వెలేటి రాధాకృష్ణ శర్మ, డీపీఆర్ఓ రవి కుమార్ చేతుల మీదుగా అందుకున్నారు. చేర్యాల ఉనికిని అన్ని రంగాల్లో చాటుతున్న చేర్యాల కవులను చేరసం సభ్యులు, మున్సిపల్ వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్ రెడ్డి, కౌన్సిలర్ మంగోలు చంటి, జబర్దస్త్ లక్ష్మి కిరణ్ తదితరులు అభినందించారు.

పంటలకు మద్దతు ధర పెంచడంపై హర్షం



నవతెలంగాణ- గజ్వేల్

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ ముట్రాజుపల్లిలో భారతీయ జనతా పార్టీ గజ్వేల్ పట్టణ కిసాన్ మోర్చా అధ్యక్షులు మర్కంటి ఎగొండ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం 15 రకాల పంటలకు ధర పెంచినందుకు నరేంద్ర మోడీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15 రకాల వ్యవసాయ పంటలకు కేంద్ర ప్రభుత్వం రైతులు లాభదాయకంగా ఉండే విధంగా మద్దతు ధర ప్రకటిచిందన్నారు. ఎన్నో సంక్షేమ పథకాలు ఈ దేశంలో అన్ని రాష్ట్రాలు అమలు చేస్తున్నప్పటికీ తెలంగాణలో మాత్రం అమలు చేయడం లేదన్నారు. తెలంగాణలో రైతులను గాలికి వదిలేసి పట్టించుకోవడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇస్తున్నటువంటి ప్రతి మండల కేంద్రంలో భూసార కేంద్రం, కేంద్ర ప్రభుత్వం నిధులతో ఏర్పాటు చేసిన భూసార పరీక్షలు నిర్వహించడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎర్రవల్లి కృష్ణ గౌడ్ కిసాన్ మోర్చా పట్టణ ఉపాధ్యక్షులు మర్కంటి రాములు, దేవులపల్లి సిద్దయ్య, బొండ్ల శ్రీను, పిట్ల రాజు, మరికంటి యాదగిరి తదితరులు పాల్గొన్నారు

మొదలైన ఇంటర్ సప్లమెంటరీ పరీక్షలు

నవతెలంగాణ-దుబ్బాక



ఇంటర్మీడి యంట్ సప్లమెంటరీ పరీక్షలు సోమ వారం ప్రశాం తంగా మొదలైనాయి. దుబ్బాక పురపాలిక కేంద్రంలో ఏర్పాటు చేసిన రెండు పరీక్ష కేంద్రాలైన ప్రభుత్వ జూనియర్, ఎస్ఆర్ జూనియర్ కళాశాలల్లో ప్రథమ, ద్వితీయ విద్యార్థులు పరీక్షలు రాశారు. ఎస్ ఆర్ కళాశాలలో (ప్రథమ, ద్వితీయ విద్యార్థులు) 66 మంది విద్యార్థులకు 7 గురు గైర్హాజరు కాగా, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 94 మంది విద్యార్థులకు 21 మంది గైర్హాజరయ్యారు. జిల్లా పరీక్షల కమిటీ మెంబర్లు మంగ రాజు, విజయేందర్ రెడ్డిలు ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించి పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలించారు. కళాశాల చీఫ్ సూపరిండెంట్ ఇంగు శివకుమార్ డిపార్ట్ మెంటల్ ఆఫీసర్ భాస్కర్, పలువురున్నారు.

ధాన్యం అమ్మిన డబ్బులు చెల్లించాలి

నవతెలంగాణ-నంగునూరు

రైతులు అమ్మిన ధాన్యం డబ్బులు చెల్లించాలని వైఎస్సార్ టీపీ మండల కన్వీనర్ ఎం.డీ.ఇమ్రాన్ డిమాండ్ చేశారు. కొనుగోలు కేంద్రాల్లో అమ్మిన రైతులకు నెలరోజులు దాటుతున్న రైతుల అకౌంట్లో డబ్బులు జమ చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. దశాబ్ది ఉత్సవాలు రైతు వేదికల దగ్గర నిర్వహించిన అధికార పార్టీ నాయకులకు రైతు సమస్యలు కనబడకపోవడం విడ్డూరంగా ఉందని తెలిపారు. 48 గంటల్లో డబ్బులు జమచేస్తామని చెప్పిన మాటలు పూర్తిగా అవాస్తవమని ఆరోపించారు. ప్రతి రోజు రైతు సంక్షేమమంటూ ఊదర గొడుతున్న ప్రభుత్వం రైతులను పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. రైతులను దృష్టిలో పెట్టుకొని వడ్ల డబ్బులు వెంటనే రైతుల అకౌంట్లో జమచేయాలని డిమాండ్ చేశారు. లేనియెడల రైతుల సమస్యలపై రైతులతో కలిసి ఆందోళనకు దిగాల్సి వస్తుందని హెచ్చరించారు.

మోగిన బడి గంట

చాక్లెట్స్ పంచి.. పూష్పాలందజేసి విద్యార్థులకు స్వాగతం

నవతెలంగాణ-బెజ్జంకి

సుమారు 45 రోజులు విద్యార్థులు వేసవి సెలవులు గడిపిన అనంతరం సోమవారం బడి గంట మోగింది. మండలంలోని పాఠశాలలు ప్రారంభమవ్వడంతో విద్యార్థులు బడి బాట పట్టారు. మండలంలోని కల్లెపల్లి ప్రభుత్వ పాఠశాలలకు హాజరైన విద్యార్థులకు ఉపాధ్యాయులు చాక్లెట్స్ పంచుతూ.. పుష్పాలందజేస్తూ ఘన స్వాగతం పలికారు. మండల కేంద్రంలోని బాలికల ప్రభుత్వోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఎంఈఓ పావని పరిశీలించారు. విద్యార్థుల తల్లిదండ్రులు వారి పిల్లల భవిష్యత్తుకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకునేలా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈఓ పావని సూచించారు.



నాణ్యమైన విద్య.. అత్యుత్తమ ఫలితాలు

ఎస్ఆర్కే డిగ్రీ, పీజీ కళాశాలకే సాధ్యం

నవ తెలంగాణ - సిద్దిపేట

నాణ్యమైన విద్య... ప్రణాళిక బద్ధమైన బోధనతోనే అత్యుత్తమ ఫలితాలు సాధిస్తున్నట్లు ఎస్ఆర్కే డిగ్రీ కళాశాల యాజమాన్యం శ్రీనివాస్, రాజశేఖర్ రెడ్డి తెలిపారు. ఉస్మానియా యూనివర్సిటీ సెమిస్టర్ ఫలితాలలో అత్యుత్తమ 10 పాయింట్స్ సాధిస్తున్న కళాశాల విద్యార్థులకు అన్ని రకాల స్కాలర్షిప్స్ అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కళాశాలలో బి బి ఏ, బిఎస్సి లో ఎంపీసీ, ఎంపీసీఎస్, ఎంసిసిఎస్ , బి జెడ్ సి, బి టి బి సి, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్, బీకాం జనరల్ కోర్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. విద్యార్థులకు అన్ని రకాల ల్యాబ్ సౌకర్యాలు, లైబ్రరీ సౌకర్యం అందుబాటులో ఉన్నాయని తెలిపారు. విద్యలో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేకమైన తరగతులను నిర్వహించి వారి ఉత్తీర్ణతకు కృషి చేస్తున్నామ న్నారు. సాధారణమైన విద్యార్థులతో అసాధార ణమైన ఫలితాలను సాధిస్తున్నామని తెలిపారు.



హలో అన్న.. క్షణాల్లో వస్తా..

నేడు ఒంటేరు ప్రతాప్ రెడ్డి జన్మదిన వేడుకలు

నవతెలంగాణ -గజ్వేల్

హలో అన్నా.. క్షణాల్లో వస్తున్న.. అంటూ ఆపద సంప దలో అనుకున్న సమయానికి చేరి మంచి, చెడు అడిగి తెలు సుకుని తన పరిధిలో ఉంటే క్షణాల్లో పరిష్కారం చేస్తారు. ఇప్పుడు ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి హరీష్ రావు కనుస న్నల్లో పరుగులు తీస్తున్నారు తెలంగాణ ఫారెస్ట్ డెవలప్మెం ట్ కార్పొరేషన్ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి. ఈయన మంగ ళవారం జన్మదిన వేడుకలు నిర్వహించుకుంటున్నారు. తెల్లవారుజాము నుంచి తన ప్రయాణం ప్రజల వద్దకు ప్రారంభమవుతుంది. ఇంటికి చేరుకునే సమయం ఎప్పుడనేది చెప్పలేం. ఆపదల్లో ప్రజలకు అందుబాటులో ఉండే ముఖ్యమైన నాయకుల్లో వంటేరు ప్రతాపరెడ్డి ఒకరిని కార్యకర్తలు అంటున్నారు. ఆపదలో తన వంతు ఆర్థిక సాయం అందించడంలో ముందు ఉంటారని చెప్పుకుంటున్నారు. పార్టీలకతీతంగా సహకారం అందిస్తున్నారు. ముఖ్యమంత్రి కెసిఆర్, మంత్రి హరీష్ రావుల సూచనలు సలహాలు పాటిస్తూ ముందుకు వెళ తున్నారు. ప్రతి గ్రామంలో కార్యకర్తలను, నాయకులను పేరుపేరున పిలిచే నాయకుడిగా గుర్తింపు ఉంది. గజ్వేల్ నియోజకవర్గంలో అన్ని గ్రామాల్లో జన్మదిన వేడుకలు



నిర్వహించేందుకు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సిద్ధమవుతున్నారు. అన్నదాన కార్యక్రమాలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

నీట మునిగి వ్యక్తి మృతి

నవతెలంగాణ-పాపన్నపేట

ప్రమాదవశాత్తూ నీట మునిగి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన ఏడుపాయల ఆలయ సమీపంలోని వనదుర్గా ప్రాజెక్టు వద్ద సోమవారం చోటు చేసుకుంది. ఎస్ఐ విజయ్ కుమార్ కథనం ప్రకారం...మెదక్ పట్టణంకి చెందిన మక్కల అభిలాష్ (23) అదే పట్టణంలోని మిల్క్ డిస్త్రి భూషన్‌లో పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆదివారం తోటి పని వారితో కలిసి ఏడుపాయల వనదుర్గామాత ఆలయానికి వచ్చాడు. దర్శనం అనంతరం విందు చేసుకుని అనంతరం వనదుర్గా ప్రాజెక్టు వద్దకు వెళ్లారు. తోటి వారు ప్రాజెక్టులో స్నానాలు చేస్తుండగా అభిలాష్ ఆనకట్టపై నుండి నీటిలో దిగుతూండగా ప్రమాదవశాత్తూ జారి నీటిలో మునిగిపోయాడు. దీంతో అక్కడే ఉన్న తోటి వారు గమనించి స్థానికుల సాయంతో నీటిలో వెతకసాగారు ఆచూకీ లభించలేదు. అప్పటికే చీకటి పడడంతో సోమవారం ఉదయం నుంచి స్థానికుల సాయంతో గాలిస్తుండగా సాయంత్రం అభిలాష్ మృతదేహం లభ్యమైంది. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. పంచనామా నిమిత్తం



మృతదేహాన్ని మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య రమణ ఉన్నారు. తల్లి దుర్గమ్మ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

నేడు మహిళా సంక్షేమ దినోత్సవం

నవతెలంగాణ-మెదక్ రూరల్

దశాబ్ది ఉత్సవాలలో భాగంగా మంగళవారం జిల్లాలోని రెండు నియోజక వర్గాలలో మహిళా సంక్షేమ దినోత్సవ కార్యక్రమాలను వివిధ సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ రాజర్షి షా సోమవారం తెలిపారు. మెదక్ నియోజకవర్గానికి సంబంధించి స్థానిక శ్రీ సాయి బాలాజీ గార్డెన్ నందు ఉదయం 10 గంటలకు, నర్సాపూర్ నియోజక వర్గానికి సంబంధించి నర్సాపూర్‌లోని సాయి కృష్ణ ఫంక్షన్ హాల్ నందు ఉదయం పదిన్నర గంటలకు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బీడీ కార్మికులు, ఒంటరి మహిళలకు ఫించన్లు, కళ్యాణ లక్ష్మి, కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్, ఆరోగ్య మహిళా, 33 శాతం రిజర్వేషన్, షీ టీమ్స్, వి హబ్ ఏర్పాటు, అంగన్వాడీలకు, ఆశా వర్కర్లకు వేతనాలు పెంపు వంటి విషయాలు ప్రస్తావించడంతో పాటు మహిళా ఉద్యోగులను సన్మానిస్తారని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, మహిళా ఉద్యోగులు, తదితరులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయవలసినదిగా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

జూన్ 13న తెలంగాణ మహిళా సంక్షేమ దినోత్సవం

నవతెలంగాణ-సంగారెడ్డి

తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈనెల 13న(మంగళవారం) ఉదయం 10 గంటలకు జిల్లా కేంద్రంలో పిఎస్ఆర్ గార్డెన్స్‌లో తెలంగాణ మహిళా సంక్షేమ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతిని ధులు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, అంగన్వాడీ టీచర్లు, సెర్ప్ సిబ్బ ంది, స్వయం సహాయక సంఘాల మహిళలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు.



అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలి

నవతెలంగాణ-అమీన్‌పూర్

అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని 19 వార్డు లింగమయ్య కాలనీలో రూ.40 లక్షల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మించ తలపెట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు సోమవారం పటాన్చెరు శాసనసభ్యులు, మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ పాండురంగారెడ్డి మాట్లాడుతూ.. 40 లక్షల రూపాయల సొంత నిధులతో రోడ్డు నిర్మాణానికి సహకరించిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మున్సిపల్ అభివృద్ధికి మరింత సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షుడు చౌటకూరి బాల్రెడ్డి, స్థానిక కౌన్సిలర్ సధువు మల్లేష్, కౌన్సిలర్ కల్పన ఉపేందర్ రెడ్డి, బిజిలి రాజు, నవనీత జగదీష్, కొల్లూరు చంద్రకళ గోపాల్, యూసుఫ్,కో ఆప్షన్ సభ్యులు తల్లారి రాములు, యూనుస్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు చౌటకూరి మైపాల్ రెడ్డి ఆంజనేయులు తిరుపతి,నీలం బిక్షపతి, సత్యనారాయణ గౌడ్, టెంపుల్ కమిటీ మెంబర్స్,ఆంజనేయులు, కొల్లూరి యాదగిరి,కార్యకర్తలు, కాలనీల వాసులు పాల్గొన్నారు.



కార్పొరేట్‌కు ధీటుగా బాస్కో హైస్కూల్‌లో బోధన





నవతెలంగాణ-గుమ్మడిదల

మండలంలోని దోమడుగు పంచాయతీ పరిధిలో గల డాన్ బాస్కో ఉన్నత పాఠశా లలో కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా విద్యాబోధన జరుగుతు న్నదని పాఠశాల యాజమాన్యం పేర్కొంది. గత పదో తరగతి ఫలితాల్లో తమ విద్యార్థులు ప్రీతి శ్రీ ఆచార్య 9.8/, యం. శివాని 9.8/, జి. సంజన 9.8 /, డి. చందన 9.8/, 9 జిపిఎ పైగా 63శాతం, 8 జిపిఎ 100 శాతం సాధించడమే అందుకు నిదర్శమని చెబుతోంది. విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తూ కంప్యూటర్ శిక్షణతో పాటు మార్షల్ ఆర్ట్ శిక్షణ అందిస్తూ.. ఉత్తమ విద్యార్థులను తయారు చేయడం లక్ష్యంగా డాన్‌బాస్కో ఉన్నత పాఠశాల కృషి చేస్తుంది. విద్యార్థులు సాధించిన ప్రగతికి, పాఠశాల చైర్మెన్, ఎక్స్ ఎంపీటీసీ అభిశెట్టి నారాయణ, దోమడుగు సర్పంచ్ రాజశేఖర్, డాన్‌బాస్కో ఉన్నత పాఠశాల రెస్పాండెంట్ స్వరూప రెడ్డి, డైరెక్టర్ వెంకట్రావులతోపాటు ఉపాధ్యాయ బృందాన్ని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అభినందించారు.

సబ్సిడీలో సోయాబీన్ విత్తనాలు ఇవ్వాలి

నవతెలంగాణ-న్యాల్‌కల్

ఖరీఫ్ సాగుకోసం సబ్సిడీలో సోయాబీన్ విత్తనాలు ఈసారి నేటికీ రాకపోవడంతో రైతు లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రైవేట్ దుకాణాల్లో అధిక ధరలకు విత్తనాలను తీసుకో వాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సబ్సిడీపై రైతులకు విత్తనాలు పంపిణీ చేయాలని కోరుతు న్నారు. అంతేకాకుండా సబ్సిడీ ఎరువులు, వ్యవసాయ పనిముట్లు కూడాసరఫరా చేసేలా వ్యవసాయ అధికారులు, ప్రభుత్వం చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రభుత్వాస్పత్రిలో వైద్యం కరువు

- **కొండాపూర్ పీహెచ్‌సీలో అందుబాటులో ఉండని డాక్టర్**
- **తన ప్రయివేటు ఆసుపత్రికే రిఫర్ చేస్తుందంటూ పలువురి ఆరోపణ**

నవతెలంగాణ-కొండాపూర్

గ్రామీణ ప్రాంతాల్లో ఏ రోగం వచ్చినా ప్రభుత్వాస్పత్రికే వెళ్తుంటారు. ప్రయివేటు ఆసుపత్రుల్లో వేలకు వేల వైద్య ఖర్చు భరించలేని పేదలే ఎక్కువగా ఈ ప్రాంతాల్లో ఉంటారు కాబట్టి.. వారికి ఏ రోగం వచ్చినా ప్రభుత్వాస్పత్రే దిక్కు. అయితే కొన్ని చోట్ల ప్రభుత్వ వైద్యులు చేస్తున్న నిర్లక్ష్యానికి పేద ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వైద్యం కోసం రోజుల తరబడి ఆసుపత్రుల చుట్టూ తిరగాల్సిన దుస్థితి నెలకొంటుంది. వైద్యులు ఎప్పుడు అందుబాటులో ఉంటారో తెలియక పోవడంతో.. గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

కొండాపూర్ మండలంలోని ప్రాథమిక ఆసుపత్రిలో గత కొన్ని రోజులుగా ఇదే దుస్థితి నడుస్తోంది. ఇక్కడి వైద్యు రాలి రేష్మాంజలి సమయపాలన పాటించడం లేదని ఆసు పత్రికి వచ్చిన రోగులు చెబుతున్నారు. ఉదయం 12 గంటలు దాటినా ఆసుపత్రికి రావడం లేదని వాపోతు న్నారు. దీంతో గర్భిణులు,





ఎమర్జెన్సీ రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలోని 24 గ్రామ పంచాయతీల ప్రజలు ఇక్కడికి వైద్యం కోసం వస్తుంటారని.. వారందరూ నిత్యం వైద్యం కోసం గంటల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడిందని చెబుతున్నారు. అంతేకాకుండా గర్భిణులను కూడా నార్మల్ డెలివరీ కాదంటూ తన ప్రయివేటు ఆసు పత్రికి రెఫర్ చేస్తున్నదని ఆరోపిస్తు న్నారు. కాబట్టి జిల్లా వైద్య అధికారులు వెంటనే స్పందించి.. నిర్లక్ష్యంగా వ్యవహ రిసున్న డాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు బాటలు



నవతెలంగాణ-హత్నూర

విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేసేది ప్రభుత్వ పాఠశాలలేనని విద్యా కమిటీ చైర్మెన్ బక్క రవి అన్నారు. సోమవారం ప్రభుత్వ హై స్కూల్, ప్రైమరీ పాఠశాలలో విద్యార్థులకు తెలంగాణ ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తున్న పాఠ్యపుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్యను అందించడంలో ముందున్నాయన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యా బోధన చేస్తున్న ఉపాధ్యాయులు విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి ప్రయోజకులుగా చేయాలన్నారు. మధ్యాహ్న భోజనం, విద్యార్థులకు యూనిఫామ్ అందించడంతోపాటు పాఠశాలలో మౌలిక సదుపాయాలు ఎప్పటికప్పుడు పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ బైసాని విజయలక్ష్మి , ప్రధానోపా ధ్యాయురాలు ప్రణతి ఉపాధ్యాయులు వెంకట్ స్వామి, గణేష, నరేందర్, శంకర్, సువర్చల, కవిత, పద్మశ్రీ, దేవయ్య, కాంతం, నర్సింలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పట్టణ శివారు ప్రాంతాల్లో మున్సిపల్ చెత్త పారబోత

- **ఇబ్బంది పడుతున్న ప్రజలు**

నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి మున్సిపల్ చెత్తను శివారు గ్రామాల ప్రాంతాల్లో పారబోస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని.. ఇలా ఇష్టారీతిన చెత్తను పారబోస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కులబ్‌గూర్ గ్రామ వార్డు సభ్యులు పీ.కృష్ణ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంగారెడ్డి మున్సిపాల్టీ డంపింగ్ యార్డు సమస్యలను ఏండ్ల నుంచి పరిష్కరించకుండా.. శివారు గ్రామాల ప్రజలను ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు. ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభం అయిందని.. ఈ చెత్తతో సీజనల్ వ్యాధులు ప్రబలించే అవకాశం ఉన్నదన్నారు. రెండేళ్ల క్రితం డంపుయార్డ్ సమస్యతో ఒక సంవత్సరం పాటు కులబ్‌గూర్



గ్రామంలోని నల్లచెరువులో చెత్తను అక్రమంగా పారబోశారన్నారు. ఈ విషయమై ప్రశ్నించిన గ్రామస్తులకు, పాలకవర్గానికి గ్రామ అభివృద్ధి కోసం కోటి రూపాయల పనులు చేస్తామని అప్పటి మున్సిపల్, జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు హామీనిచ్చి మోసం చేశారన్నారు. ఆ రుట్ల పరిధిలో వేస్తున్న చెత్తను అక్కడి ప్రజలు అడుకోవడంతో తిరిగి డంపింగ్ యార్డ్ సమస్య ఏర్పడిం దన్నారు. ఈ నేపథ్యంలో సంగారెడ్డి మున్సిపల్ అధికారులు రాత్రి వేళలో గుట్టుచప్పుడు కాకుండా శివారు ప్రాంతాల్లో రోడ్లవెంట, ఖాళీ స్థలాల్లో చెత్తను పారబోస్తున్నారన్నారు. వీ రి ప్రయత్నాలను మానుకోకపోతే మున్సిపల్ కార్యాల యం ముందు చెత్తను పారబోసి.. గ్రామస్తులందరినీ ఐక్యం చేసి కార్యాలయాన్ని పెద్దఎత్తున ముట్టడిస్తామని హెచ్చరించారు.

సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

నవతెలంగాణ-జహీరాబాద్

తెలంగాణ వికలాంగుల వేదిక జిల్లా అధ్యక్షుడు రాయికోటి నర్సింలు ఆధ్వర్యంలో సోమవారం సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలభిషేకం చేయడం జరిగింది. సోమవారం రాయికోటి నర్సింలు మాట్లాడుతూ.. దివ్యాంగుల కష్టాలను గుర్తించి అడగకముందే రూ.3016 పింఛన్‌ను రూ.4016 పెంచారన్నారు. ఈ శుభ సందర్భంలో రాష్ట్రంలోని దివ్యాంగుల అందరూ ఎంతో సంతోషంగా ఉన్నారు కాబట్టి టపాసులు కాల్చి స్వీట్ల పంపిణీ చేయడం జరిగిందన్నారు. రాబోయే కాలంలో మళ్ళీ బీఆర్ఎస్‌ను గెలిపించుకోవాలన్నారు. కాంగ్రెస్ పార్టీ హయాంలో ఏం పెన్షన్ పెట్టలేదని.. దివ్యాంగులను ఏనాడు కూడా కాంగ్రెస్ పార్టీ గుర్తించలేదని.. అలాగే బిజెపి పార్టీ కూడా దివ్యాంగుల కోసం ఎలాంటి పథకాలు పెట్టలేదన్నారు.



సీఎం కేసీఆర్ దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాడన్నారు. ఏ రాష్ట్రంలో లేని అనేక పథకాలను ప్రవేశపెట్టిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వికలాంగుల వేదిక జిల్లా సహాయ కార్యదర్శి శోభ నాయకురాలు బిస్మిల్లా, సంగన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉత్తమ బోధన

నవతెలంగాణ-న్యాల్‌కల్

విద్యార్థులకు మెరుగైన, ఉత్తమమైన బోధన అందించేందుకు ప్రభుత్వం అని రకాల సౌకర్యాలను ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేసిందని పాఠశాల హెచ్ఎం సఫియా సుల్తానా అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో సోమవారం ప్రారంభం అవడంతో రేజింతల్ ప్రాథమిక పాఠశాలలో మామిడి తోరణాలు, ఆటపాటలతో విద్యార్థులను స్వాగతించారు. ప్రతీ విద్యార్థిని ప్రభుత్వ పాఠశాలల్లోనే



చేర్పించాలన్నారు.



అందూర్ బోనాల జాతరలో ఎమ్మెల్యే జిఎంఆర్

నవతెలంగాణ-జిన్నారం

మండలంలోని అండూరు గ్రామంలో సోమవారం బోనాల జాతర ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలకు పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. మహిళలు బోనాలతో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. కోలాటం ఒగ్గు కళాకారుల నృత్యాలు డప్పుల దరువులతో ఘనంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు ఎమ్మెల్యేలు ఘనంగా సన్మానించారు. అమ్మవారి ఆశీస్సులతో తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా అభివృద్ధిలో ముందుకెళ్తుందనీ ఎమ్మెల్యే పేర్కొన్నారన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్, రాష్ట్ర యువత నాయకులు వెంకటేశం గౌడ్ స్థానిక సర్పంచ్ ఖదీర్, ఎంపీటీసీ స్వాతి ప్రభాకర్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు గ్రామస్తులు మహిళలు పాల్గొన్నారు. బోనాల జాతర ఉత్సవాల నేపథ్యంలో కళాకారులు మహిళలు బృందాలుగా నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమాలు విశేషంగా పలువురిని అలరించాయి.

పట్టభద్రులైన న్యాయశాస్త్ర యువతీ యువకులకు స్టయిఫండ్‌తో కూడిన శిక్షణ

నవతెలంగాణ-సంగారెడ్డి

షెడ్యూల్డ్ కులములకు చెందిన న్యాయశాస్త్ర పట్టబద్రులైన యువతీ యువకులకు జిల్లా మండలి పబ్లిక్ ప్రాసిక్యూటర్/ గవర్నమెంటు ప్లీడరుల వద్ద జూనియర్‌గా చేర్పించి, 3ఏండ్ల న్యాయశాస్త్ర పరిపాలన యందు స్టయిఫండ్‌తో కూడిన శిక్షణ ఇప్పించడం జరుగుతుందని జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ అధికారి జగదీష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023-24 సంవత్సరానికి గాను ఉమ్మడి మెదక్ జిల్లా యందలి షెడ్యుల్డ్ కులములకు చెందిన అభ్యర్థులకు (8) సీట్లు కేటాయించినట్లు తెలిపారు. న్యాయశాస్రం లో పట్టాపొంది, సంవత్సర ఆదాయము రెండు లక్షలకు మించని వారు అర్హులని తెలిపారు. (మీసేవ నుండి 01-04-2023 తదుపరి పొందినది) తమ కుల, ఆదాయ, నివాస ధృవీకరణ పత్రాలతో, డిగ్రీ, న్యాయ శాస్త్ర విద్య పట్టాలతో, బార్ అసోసియేషన్ రిజిస్ట్రేషన్, ఆధార్ కార్డు, రేషన్ కార్డు జిరాక్స్ ప్రజలతో http://telanganaepass.cgg.gov.in వెబ్‌సైట్‌లో జూన్ 13 నుంచి 30 లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.